E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 01-09-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




రాష్ట్రంలో రెండ్రోజులపాటు వర్షా లు » 3లో


గూగుల్ ఎమర్జెన్సీ అలర్ట్.. ఆ 2.5 బిలియన్ మంది జీమెయిల్ పాస్‌వర్డ్స్ మార్చాల్సిందే! » 4లో




మరో హారర్ చిత్రంలో రష్మిక? » 5లో



సక్సెస్ అంటే డబ్బు, పేరు కాదు.. అలాంటి సినిమాలు చేయాలనుంది! » 5లో



‘ఇంకెన్ని రోజులు ఇలా..’ రిషబ్ పంత్ ఇన్‌స్టా స్టోరీ వైరల్ » 6లో



# కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐ విచారణ



- లక్ష కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్
- ప్రజాస్వామ్యం కాబట్టి నడి బజారులో ఉరి తీయలేదు
- విచారణకు అప్పగించాలని అసెంబ్లీ నిర్ణయం.. సీఎం ప్రకటన
- కేంద్ర సంస్థలు, అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున సీబీఐకి అప్పగించడమే మంచిదని నిర్ణయించాం: సీఎం రేవంత్



తరువాయి 2లో

ఈకబురు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిని సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించింది. బ్యారేజీలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దీనిపై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా విచారణను సీబీఐకి అప్పగించడానికి కారణాలను ఆయన వివరించారు. “కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదికను జూలై 31న ప్రభుత్వానికి అందిస్తే... ఆగస్టు 4న మంత్రివర్గం ఈ నివేదికను ఆమోదించింది. తదుపరి మంత్రివర్గం నిర్ణయంతో అసెంబ్లీలో పెట్టి, చర్చ చేపట్టాం. కమిషన్ క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. విచారణలో అనేక లోపాలు, అవకతవకలు గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలు తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల అంశాన్ని ప్రస్తావించింది. ప్లానింగ్ లేదని తేల్చింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి క్వాలిటీ కంట్రోల్, నాణ్యత, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల లోపాలు ఏర్పడ్డాయని ఎన్‌డీఎస్‌ఏ గుర్తించింది. ఈ అంశాలపై మరింత లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎన్‌డీఎస్‌ఏ, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి.

తరువాయి 2లో

## కేసీఆర్‌పై చర్యలు చేపట్టేందుకు సర్కారుకు స్వేచ్ఛ ఉంది

- కాళేశ్వరం అతిపెద్ద మానవ తప్పిదం
- లక్ష ఎకరాలకూ నీళ్లివ్వలేదు: ఉత్తమ్‌



ఈకబురు, హైదరాబాద్: గత ప్రభుత్వంలో బాధ్యతా రహితంగా నిర్మించిన కాళేశ్వరం తప్పిదాలకు నాటి సీఎం కేసీఆరే బాధ్యులని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనలను పట్టించుకోకుండా అక్రమంగా, అసంబద్ధంగా కాళేశ్వరం కట్టారని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణంతో రాష్ట్రానికి భారీగా ఆర్థిక నష్టం జరిగిందని, అక్రమాలకు పూర్తిబాధ్యత కేసీఆర్‌దేనని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించిందని తెలిపారు. కేసీఆర్‌పై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు.

## 660 పేజీల నివేదికపై అరగంటలో మాట్లాడమంటే ఎలా?: హరీశ్‌రావు

గన్‌పార్క్ వద్ద నిరసన.. ఘోష్ నివేదిక అంతా ట్రాష్

కాంగ్రెస్ కుట్రలను ఎండగడతామన్న కేటీఆర్, హరీశ్

చెత్త నివేదిక.. చిత్తుకాగితంతో సమానం

రాజ్యాంగం కల్పించిన హక్కుగా కోర్టుకెళ్తే తప్పేంటి?

ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ కంపెనీనా?: హరీశ్

ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున ‘ఒకే ఒక్కడు’గా ప్రసంగం



ఈకబురు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే ఎలా?

తరువాయి 2లో

# సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు

తరువాయి 3లో

- భారత్-చైనా స్నేహితులుగా ఉండడమే మంచిది
- సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం
- ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం
- శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం
- ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం
- బంధం బాగుండాలంటే శాంతి, స్థిరత్వం ముఖ్యం
- పరస్పర నమ్మకం, గౌరవంతో ముందుకెళదాం మన బంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దు
- భారత్, చైనా మధ్య సహకారం మానవాళి సంక్షేమానికి బాటలు వేస్తుంది: మోదీ
- డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి: జిన్‌పింగ్
- వచ్చే ఏడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాలని జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం
- బ్రిక్స్ అధ్యక్షత కోసం భారత్‌కు జిన్‌పింగ్ మద్దతు



## ఎడ్యుకేట్ గాళ్స్’కు ‘మెగసెసే’ అవార్డు

మనదేశంలో బాలికల విద్యకోసం పనిచేస్తున్న ప్రముఖ ఎన్జీవో ‘ఎడ్యుకేట్ గాళ్స్’ప్రతిష్టాత్మక రామన్ మెగసెసే–2025 అవార్డును గెలుచుకుంది. ఈ పురస్కారాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సంస్థగా రికార్డు సృష్టించింది. ‘ఎడ్యుకేట్ గాళ్స్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు, యువతులకు విద్యనందిస్తోంది. వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి సామర్థ్యాన్ని, ధైర్యాన్ని నింపుతోంది.

తరువాయి 3లో



## బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!

- బీసీ రిజర్వేషన్ బిల్లులను రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర
- గత ప్రభుత్వం తెచ్చిన చట్టాలే నేడు గుదిబండలుగా మారాయి
- వాటిని అధిగమించేందుకు ఆర్డినెన్స్ తెస్తే గవర్నర్ ఆమోదించకుండా చేశారు
- కల్వకుంట్ల కుటుంబం కాదు.. ఎవరినీ కలవకుండా చేసే కుటుంబం
- రిజర్వేషన్లపై ఆ పార్టీకి సంతోషం లేదు.. ఢిల్లీ ధర్నాలో ఎందుకు పాల్గొనలేదు?
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



ఈకబురు,రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందకుండా వాటిని రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు బిల్లులను ఆమోదించి, గవర్నర్‌కు పంపితే.. వాటిని రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెలలుగా అవి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రస్తుత గవర్నర్ ఒకప్పుడు ఆర్థిక మంత్రిగా పనిచేశారని, గతంలో తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఓ వ్యక్తి.. బీసీ బిల్లులను రాష్ట్రపతికి పంపేలా గవర్నర్ వద్ద తెరవెనుక లాబీయింగ్ చేశారని చెప్పారు. ఆదివారం శాసనసభలో మునిసిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన పంచాయతీ రాజ్ చట్టం, 2019లో తెచ్చిన మునిసిపల్ చట్టం.. స్థానిక సంస్థల్లో 50 శాతంలోపే రిజర్వేషన్లు ఉండాలని చెబుతున్నాయన్నారు. అవే ఇప్పుడు పెద్ద గుదిబండలుగా మారాయన్నారు. ఆ అడ్డంకులను అధిగమించి, స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, దాన్ని మళ్లీ గవర్నర్‌కు పంపామని తెలిపారు. అయితే ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించే విషయంలో కూడా గవర్నర్ బీఆర్ఎస్ మాటలు నమ్మారని అన్నారు.

తరువాయి2లో



## హరీశ్‌రావు కాదు.. కాళేశ్వర్ రావు!

- కాళేశ్వరం ప్రాజెక్టులాగే కుంగిపోతూ నిటారుగా నిలబడలేకపోతున్నారు: భట్టి విక్రమార్క » 2లో

ఈకబురు, కాళేశ్వరం ప్రాజెక్టును ఆయనే ముందుండి నిర్మింపజేశారని అప్పటి ప్రభుత్వ పెద్దలు హరీశ్‌రావుకు ‘కాళేశ్వర్‌రావు’ అనే పేరు పెట్టారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ నివేదికను చూశాక హరీశ్‌రావు ఆ కాళేశ్వరం ప్రాజెక్టులాగే కుంగిపోతూ.. కూలిపోతూ.. నిటారుగా నిలబడలేక.. వాస్తవాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారని ఎద్దేవా చేశారు.



## సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలి

- ఒకే అంశంపై 5 రకాలుగా మాట్లాడుతున్నారు » 2లో
- ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టని గవర్నర్ అసెంబ్లీ తీర్మానాన్ని ఎలా ఆమోదిస్తారు?: కేటీఆర్

## ‘ఓటర్ అధికార్ యాత్ర’.. బిహార్‌లో కాంగ్రెస్‌కు బూస్ట్ ఇచ్చేనా?

» 2లో



మొదటి పేజీ తరువాయి

## కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సీబీఐ విచారణ

ఈ ప్రాజెక్టులో అంతరాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, వ్యాప్కోస్ వంటి కేంద్ర సంస్థలు, పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ ఆర్థిక సంస్థలు పాల్పంచుకున్నందున ఈ కేసును సీబీఐకి అప్పగించడం సముచిత మని నిర్ణయం తీసుకున్నాం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని సభ నిర్ణయం తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నో రకాల అంశాలు, విచారణకు అర్హమైన అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించామన్నారు. ధవళేశ్వరంపై ప్రాజెక్టు కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌ను ప్రజలు కాటన్ దొర అని దేవుడిలా పూజిస్తుంటే.. దొరగా పుట్టానని గొప్పగా చెప్పుకొనే కేసీఆర్ .. తెలంగాణలో దోపిడీ దొంగగా మారారని ఆరోపించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుందని, రాష్ట్రప్రజలపై లక్షన్నర కోట్ల అప్పుల భారం వేసిందని అన్నారు. ప్రజాస్వామ్య దేశమైనందున.. కేసీఆర్ చేసిన పాపాలకు నడి బజారులో ఉరి తీయలేమని, రాళ్లతో కొట్టలేమని పేర్కొన్నారు. అందరి అనుమతితో నిర్ణయం తీసుకోవాలనే ఈరోజు అర్ధరాత్రి సమావేశం పెట్టామన్నారు.

కాళేశ్వరంపై రూ. 49835 కోట్లు అప్పు కట్టాం..

ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాళేశ్వరం కోసం రూ. 87,449 కోట్లు అప్పులు తెచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, విజయ బ్యాంకుల నుంచి 14 ఏళ్ల కాలానికి అత్యధికంగా 11.5 శాతం వడ్డీకి తెచ్చారని పేర్కొన్నారు. ఆ నిధులతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టారన్నారు. అసలు, వడ్డీలు కలిపి ఇప్పటివరకు రూ.49,835 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.60,769 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. పెండింగులో ఉన్న పనులు పూర్తిచేయాలంటే ఇంకా రూ.47 వేల కోట్లు కావాలన్నారు. కాగా, అర్ధరాత్రి దాటిన తరువాత 1.40 గంటలకు సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.



## కేసీఆర్‌పై చర్యలు చేపట్టేందుకు సర్కారుకు స్వేచ్ఛ ఉంది

అసంబద్ధంగా కాళేశ్వరం కట్టారని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణంతో రాష్ట్రానికి భారీగా ఆర్థిక నష్టం జరిగిందని, అక్రమాలకు పూర్తిబాధ్యత కేసీఆర్‌దేనని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించిందని తెలిపారు. కేసీఆర్‌పై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. ''సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును మొదలుపెట్టినట్లు నివేదికలో ఉంది. కేసీఆర్ చెప్పినట్లే చేశామని అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి కాంట్రాక్టర్లకు మేలు చేయడానికే పనులు అప్పగించారు. అప్పటి నేతలతోపాటు అధికారులు, ఇంజనీర్లు ఎవరెవరు బాధ్యులో కూడా కమిషన్ స్పష్టం చేసింది. 666 పేజీల కమిషన్ నివేదికను అసెంబ్లీ ముందుంచాం. సభ్యుల అభిప్రాయాల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సీఎం రేవంత్ ప్రకటిస్తారు'' అని ఉత్తమ్ తెలిపారు.

కాళేశ్వరం అతిపెద్ద మానవతప్పిదం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రపంచంలోనే అతిపెద్ద మానవ తప్పిదమని ఉత్తమ్ విమర్శించారు. కాళేశ్వరానికి గుండెకాయలాంటి మేడిగడ్డ కూలడంతో రూ.21 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని ఆరోపించారు. 20 నెలలుగా అన్నారం సుందిళ్ల, మేడిగడ్డ నిరుపయోగంగా మారాయన్నారు. ప్రాణహితచేవెళ్లను 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని.. 2014నాటికి రూ.11 వేలకోట్లు ఖర్చుపెట్టారని ఉత్తమ్ గుర్తు చేశారు. రూ.38,500కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను అకారణంగా మార్చి కాళేశ్వరం చేపట్టారని తెలిపారు. ఏడాదికి 195 టీఎంసీలు ఎత్తిపోస్తామని చెప్పి.. ఐదేళ్లలో 125 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారన్నారు. లక్ష కోట్లు ఖర్చుచేసినా ఐదేళ్లలో వాడుకున్న నీళ్లు 101 టీఎంసీలేనని, స్వతంత్ర దేశంలో ఇదో పెద్ద ఆర్థిక నష్టమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నిర్వహణ పెనుభారంగా మారిందని, విద్యుత్ శాఖకు రూ.9,735కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టు వారి హయాంలోనే కూలడంతో.. ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తప్పు చేసిన వారెవరైనా సిగ్గుపడతారని, కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దబాయిస్తున్నారని విమర్శించారు.



## హరీశ్‌రావు కాదు.. కాళేశ్వర్ రావు!

ఇప్పుడు జస్టిస్ ఘోష్ నివేదికను చూశాక హరీశ్‌రావు ఆ కాళేశ్వరం ప్రాజెక్టులాగే కుంగిపోతూ.. కూలిపోతూ.. నిటారుగా నిలబడలేక.. వాస్తవాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీలో భట్టి మాట్లాడుతూ ''హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలను పక్కదోవ పట్టించాలని చూస్తున్నారు. సభలో ఎప్పుడు చర్చ జరిగినా ఆయన వాస్తవాలు మాట్లాడరు. తప్పుడు కాగితాలు సృష్టిస్తారు. ఏ అంశం తీసుకున్నా అది తప్ప మిగతావి మాట్లాడతార'ని విమర్శించారు. వంద సంవత్సరాల క్రితం నిర్మించిన నిజాంసాగర్, పోచారం వంటి ప్రాజెక్టులు భారీ వరదలను తట్టుకొని నిలబడ్డాయి కానీ లక్షన్నర కోట్లు వెచ్చించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకుండానే కుంగిపోయిందన్నారు. ''ఈ దోపిడీపై జ్యుడిషియల్ కమిషన్ రిపోర్టును చెత్త రిపోర్టు అంటారు. మరి మీరు దేనికి ఒప్పుకుంటారు హరీశ్‌రావు గారూ? మీరంతా అతీతులా, దైవాంశసంభూతులా? తప్పు చేయకపోతే ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టుకు ఎందుకు వెళ్లారు?''అని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్దే ప్రాజెక్టు నిర్మిస్తే దోపిడీ చేయడానికి వీలుండదని కాళేశ్వరాన్ని ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఎత్తిపోసిన నీళ్ల కంటే కిందికి వదిలినవే ఎక్కువని, కాళేశ్వరం ద్వారా నీళ్లు ఎత్తిపోయడానికి విద్యుత్ బిల్లులు రూ.12 వేల కోట్లు అయ్యాయన్నారు. ''కేసీఆర్ చెప్పారు.. హరీశ్‌రావు కట్టారు. మేం ఇందిరమ్మ ఇల్లు కట్టాలన్నా ఇంజనీరు సలహా తీసుకుంటాం. కానీ లక్షన్నర కోట్లు వెచ్చించిన ప్రాజెక్టు ఇంజనీర్లు ఇచ్చిన డిజైన్‌ను హరీశ్‌రావు పెద్ద ఇంజనీరులాగా మార్చేసి కట్టడం వల్లే ఈ ప్రమాదం ముంచుకొచ్చింది''అని మండిపడ్డారు. ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడితే తలెత్తుకోలేమని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లారన్నారు. బీఆర్ఎస్ నేతలు కృష్ణా, గోదావరిపై ఏ ప్రాజెక్టునూ వదల్లేదని, చీల్చిచెండాడారని వ్యాఖ్యానించారు. ''కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏం చేయాలో నిర్ణయం తీసుకునేందుకు సభలో ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాం.. చర్చించాం. ఏం చేద్దామని రాష్ట్ర ప్రజలను అడుగుతున్నామ''ని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు జస్టిస్ ఘోష్‌పై అభాండాలు వేయడం తగదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెబితే బాగుండేదని సూచించారు. పదేళ్లు తమకు మైక్ ఇవ్వకపోయినా అడిగి అడిగి అలిసిపోయామే తప్ప సభను వదిలిపెట్టి ఏనాడూ పోలేదన్నారు. కేవలం ఐదుగురు సభ్యులం పదేళ్ల పాటు పోరాటం చేశామని గుర్తుచేశారు.



మొదటి పేజీ తరువాయి

## సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలి



ఈ-కబురు, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగి.. బీసీలకు రాష్ట్ర స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. "రిజర్వేషన్లు పార్లమెంట్ పరిధిలోని అంశం. అంతేగానీ, అసెంబ్లీలో ఎంత గట్టిగా మాట్లాడినా.. పొలిటికల్ డైలాగులు కొట్టినా లాభం లేదు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడేందుకు రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. అందుకు మేం సహకరిస్తాం. కాంగ్రెస్-బీజేపీ తలచుకుంటే.. మోదీ-రాహుల్ కలిసి టీ తాగేలోపు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి, బీసీలకు న్యాయం చేయొచ్చు. పార్లమెంట్ ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే పరిష్కారం" అని వ్యాఖ్యానించారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా.. ఆ దిశలో ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. 2018 పంచాయతీరాజ్ చట్ట సవరణతో 50% రిజర్వేషన్ల పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో 5 రకాలుగా మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. "కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కేంద్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పి ఉండాల్సింది. అలా చేయకుండా.. హడావుడిగా ప్రకటించి, ఇప్పుడు చిత్తశుద్ధి లేనట్లు వ్యవహరిస్తోంది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను సాధిస్తామని ఒకసారి చెప్పారు. ఆర్డినెన్స్ ద్వారా అంటూ మరోసారి చెప్పారు. పార్టీపరంగా అని ఇంకోసారి.. రాహుల్ ప్రధాని అయితేనే అని మరోమారు ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ బిల్లు తీసుకొచ్చారు. ఒకే అంశంపై ఐదు రకాలుగా చెబుతుంటే.. బీసీలు అర్థం చేసుకోలేరా?" అని ప్రశ్నించారు. గతంలో పంపిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం చేయలేదని, ఇప్పుడు శాసనసభ తీర్మానంపై ఎలా ఆమోదం వ్యక్తం చేస్తారని నిలదీశారు. "మార్చి నెలలో అసెంబ్లీ ఆమోదించి, రాష్ట్రపతికి పంపిన బిల్లుకు.. తాజా బిల్లుకు తేడా ఏంటో చెప్పాలి. సెప్టెంబరు 30లోపు రిజర్వేషన్లు ఇచ్చి, ఎన్నికలను ఎలా పూర్తిచేస్తారు? గవర్నర్‌తో సంతకం ఎలా చేయిస్తారు?" అనే విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కనీసం 15 రోజులైనా సభను నడపమని అడుగుతుంటే ప్రభుత్వం పారిపోతోందని ఎద్దేవా చేశారు

మొదటి పేజీ తరువాయి

# బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!

**బీఆర్ఎస్ మాటలు నమ్మారని అన్నారు. బీసీలను బీసీలే అవమానించుకోవద్దు..**

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయంటూ కొందరు కోర్టుకు వెళ్లారని సీఎం రేవంత్ తెలిపారు. దీంతో సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్లు సైతం ఖరారు చేయాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఉన్న చట్టాలను పరిశీలిస్తే 50 శాతం రిజర్వేషన్లకు లోబడి ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్నాయని పేర్కొన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని గవర్నర్‌కు పంపిందని అన్నారు. ఆర్డినెన్స్ ఆమోదం పొందనందున.. శాసనసభలో రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదించుకుందామని పిలుపునిచ్చారు. సభా నాయకుడిగా చిత్తశుద్ధితో దీనిని అమలు చేసే బాధ్యత తనదన్నారు. దీనిని చిలువలు, పలువలు చేయవద్దని, బీసీలను బీసీలే అవమానించుకోవద్దని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఒకరినొకరు విమర్శించుకుంటే ఇతరుల ముందు పలుచన అవుతారని వ్యాఖ్యానించారు. మంచి జరిగేటప్పుడు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అలా కాకుండా యజమానులను ఒప్పించడానికి, సంతోషపెట్టడానికి మంత్రులపై పరుషమైన పదజాలం ప్రయోగించవద్దని గంగులకు హితవు పలికారు. సభను వేదికగా మార్చుకొని బలహీన వర్గాలకు అనుమానం కలిగించేలా, తెలంగాణ సమాజంలో అపోహలు సృష్టించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దన్నారు.

వాళ్లకు సంతోషం లేదు..

బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పిస్తుంటే వారికి (బీఆర్ఎస్ నేతలకు) సంతోషం లేదని సీఎం రేవంత్ అన్నారు. వారి కడుపు నిండా దుఃఖం, బాధ, విషం ఉన్నాయని ఆరోపించారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదంటూ గంగుల ప్రశ్నిస్తున్నారని, అయితే ప్రధానికి తాను ఐదుసార్లు లేఖ రాసి.. అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వలేదని తెలిపారు. దీంతో ప్రధానిపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జంతర్‌మంతర్ వద్ద తాము ఆందోళన చేశామని గుర్తు చేశారు. అందులో వందమంది ఎంపీలు పాల్గొన్నారని, కానీ.. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ అబద్ధాల ప్రాతిపదికన మాట్లాడుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు కనువిప్పు కలిగించేందుకే ఫిబ్రవరి 4న సోషల్ జస్టిస్ డే జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. బీఆర్ఎస్ తప్పులు చేసినందునే ప్రజలు శిక్ష విధించారని, ప్రజాతీర్పు మేరకు ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తామని, ఇందుకు బీఆర్ఎస్ సహకరించాలని కోరారు. బుద్ధి మారకపోతే ప్రజలు మళ్లీ ఇంకో తీర్పు ఇస్తారని, ఈసారి ప్రతిపక్ష హోదా కూడా ఉండదని హెచ్చరించారు. బీఆర్ఎస్ తమకు సుద్దులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ముందుగా వారి నాయకుణ్ని (కేసీఆర్) వచ్చి సభలో కూర్చోవాలని చెప్పాలన్నారు. బీసీలకు న్యాయం చేయాలని వందేళ్లుగా జరగని కులగణనను కాంగ్రెస్ సర్కారు చేసిందని రేవంత్ అన్నారు. దానిని ప్రధానప్రతిపక్ష నేత అభినందిస్తే.. ఆయన పెద్దరికం పెరిగి ఉండేదన్నారు. ఆయన సభకు రారని, ఆయన పంపిన వారేమో అవాస్తవాలు మా ట్లాడుతున్నారని మండిపడ్డారు.

క్రురుకాల్చి వాత పెట్టాను

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ ఒత్తిడికి లొంగవద్దని గంగులకు సీఎం రేవంత్ సూచించారు. బీఆర్ఎస్ పోకడలు ఎలా ఉంటాయో తనకు తెలుసునని, అందుకే వారికి క్రురుకాల్చి వాత పెట్టి సీఎంను అయ్యాయన్నారు. బీసీ బిల్లుపై రాజకీయ వివాదాలకు తావు లేకుండా, ఆరోపణలు చేయకుండా సూచనలు చేయాలని కోరారు. ''కల్వకుంట్ల కుటుంబం అంటే ఎవరినీ కలవకుండా ఉంచడం. బీసీలు, ఓసీలు కలవద్దని, ఎస్సీలు, ఎస్టీలు కలవద్దని, మైనారిటీలు, హిందువులు కలవద్దనే కుటుంబం''అని సీఎం వ్యాఖ్యానించారు. బీసీ బిల్లుపై చర్చ లేకుండా సభ అంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశముంటుందన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్‌ను బీజేపీ మిత్రుడు పాయల శంకర్ ఇప్పించాలని కోరారు. అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే అంతా కలిసివెళ్లి రాష్ట్రపతి వద్ద పెండింగ్ ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించుకుందామన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పంచాయతీరాజ్ చట్టం2018 లోని సెక్షన్ 285(ఏ)ను సవరించి, 50 శాతం పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభ లో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. బిల్లును సభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగిన అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.



# 12 రోజుల్లోనే టెండర్లకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది?!

ఈకబురు,హైదరాబాద్: వాప్కోస్ నివేదిక ఇచ్చిన 12 రోజుల్లోనే డీపీఆర్‌కు అంగీకారం తెలిపి, అంచనాలు రూపొందించి కాళేశ్వరం టెండర్లకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. శాసనసభలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చలో ఆయన మాట్లాడారు. ''మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కట్టే సమయంలో డీపీఆర్, టెండర్లకు అంత తొందరగా ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? రూ.లక్ష కోట్లు విలువ చేసే ప్రాజెక్టులు కట్టే సమయంలో రాత్రికి రాత్రే ఎలా నిర్ణయం తీసుకున్నారు? 3 బ్యారేజీలు నిర్మించాలని 25 రోజుల్లోనే నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి కోసం ఉమ్మడి రాష్ట్రంలో రూ.5,500కోట్లు ఖర్చు చేశారు. 2014 తర్వాత హరీశ్ మంత్రిగా ఉన్నప్పుడూ రూ.6,100కోట్లు ఖర్చు చేశారు. ఏం ఆత్రుత వచ్చిందని రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును వదిలేసి మేడిగడ్డ వద్ద కట్టాలనుకున్నారు? ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని మేడిగడ్డకు మార్చడంలో కుట్ర ఉంది. ఒక ఆపరేటర్‌ను పిలిచి గూగుల్ మ్యాప్‌ను చూపించి ప్రాజెక్టులను డిజైన్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చారు. వ్యయాన్ని రూ.18 వేల కోట్లకు పెంచారు'' అని పొంగులేటి పేర్కొన్నారు.

దయాఫ్రమ్ వాల్‌ని కాంక్రీటుతో కట్టి ఉంటే కూలేది కాదు..

''కాళేశ్వరంలో దయాఫ్రమ్ వాల్‌ని కాంక్రీటుతో కట్టి ఉంటే ప్రాజెక్టు కూలి ఉండేది కాదు. వాప్కోస్ డీపీఆర్‌లో ఎగువన, దిగువన కాంక్రీటుతో కట్టాలని ఉంది. సీకెంట్ పైల్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో 30 శాతమే దయాఫ్రమ్ వాల్‌కి అయ్యేది. అయినా సీకెంట్ పైల్‌ను ఏర్పాటు చేయాలని మామ, అల్లుడు అన్నారు. సీకెంట్ పైల్‌కు హరీశ్‌రావు కింగ్‌పిన్. రూ.లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకుపోవడానికి ఈ సీకెంట్ పైలే కారణం. దీనికి మామ, అల్లుడు బాధ్యులు'' అని పొంగులేటి ఆరోపించారు.



మొదటి పేజీ తరువాయి

## 660 పేజీల నివేదికపై అరగంటలో మాట్లాడమంటే ఎలా?: హరీశ్‌రావు



ఈకబురు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే ఎలా? ఇది సాధ్యమయ్యే పనేనా?అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాళేశ్వరం కమిషన్ నివేదిక ఏకపక్షమని, అందులో అబద్ధాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీనిపై సభలో వివరణ ఇవ్వడానికి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదని ఆరోపిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఆదివారం రాత్రి అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కక్షపూరితంగా తీసుకొచ్చిన కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక అంతా ట్రాష్ అని, అందులో ఉన్నవన్నీ అబద్ధాలేనని ఆరోపిస్తూ నివేదిక ప్రతులు చించి చెత్తబుట్టలో వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో తమ గొంతు నొక్కారని, స్పీకర్ ఏం సంబంధం లేనట్లు వ్యవహరించారని ఆరోపించారు. తమ నేత హరీశ్‌రావు ఒకరు మాట్లాడితే.. సీఎం సహా మంత్రులంతా అబద్ధాలు చెప్పారన్నారు. కాళేశ్వరంపై కుట్రను ప్రజల్లో ఎండగడతామని, ఆ ప్రాజెక్టును కూల్చి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టాన్ని ఉల్లంఘించి కాళేశ్వరంపై పీసీ ఘోష్ ఇచ్చిన చెత్త నివేదికపై న్యాయపోరాటం చేస్తామని, దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

''నాకు రెండుగంటల సమయం ఇవ్వాలి. మధ్యలో జోక్యం చేసుకోవద్దు. ఆదివారం రోజు సభలో నివేదిక పెట్టారంటేనే వారి ఉద్దేశం అర్థమవుతోంది. కోర్టుకు వెళ్లడం మాకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. గతంలో ఇలాంటి విషయాలపై ఇందిరా గాంధీ, అద్వాణీ కూడా కోర్టుకు వెళ్లారు. ఆదరాబాదరాగా ఆదివారం సభలో పెట్టారంటేనే మీ కుట్రలు అర్థమవుతున్నాయి. మీరు చేసిందంతా పొలిటికల్ డ్రామా అని తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగిందా? లేదా? తేలాలి. నిష్పాక్షికంగా జరగకపోతే ఆ కమిషన్ నివేదిక చిత్తుకాగితమని సుప్రీం కోర్టు చెప్పింది. ఆరోపణలపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లో స్పష్టంగా చెప్పారు. సభ్యులకు 8బి, 8సి కింద నోటీసులు ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉంది. 8బి కింద నోటీసులు ఇవ్వకపోతే ఆ కమిషన్ నివేదికలు చెల్లవని సుప్రీంకోర్టు చెప్పింది.

భట్టి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాలకు దూరం: హరీశ్

బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపణలను రుజువు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 17 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు నిరూపిస్తే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో తాను మాట్లాడుతున్నప్పుడు సీఎంతోపాటు 8 మంది మంత్రులు తనను 33 సార్లు అడ్డుకున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై బురద చల్లి ఏ విధంగా ఓట్లు రాబట్టుకోవాలనే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఘోష్ నివేదిక ఏకపక్షమని, ఎన్‌డీఏకు అనుకూలంగా ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఉందని అసెంబ్లీలో వివరించామన్నారు. గంటన్నర సేపు స్పీకర్‌ను, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిని ప్రాధే యపడినా తమకు మైక్ ఇవ్వలేదని ఆరోపించారు. కోర్టులో కొట్టుకుపోతుందన్న భయంతోనే ఆదివారం అసెంబ్లీ పెట్టి కాళేశ్వరం కమిషన్‌పై చర్చ పెట్టారని ఆయన విమర్శించారు.

ఎమర్జెన్సీపై విచారణ జరపాలని షా కమిషన్ వేశారు. దానిపై దేశమంతా కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారు. షా కమిషన్‌ను ఆనాడు నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తిట్టారు. చట్టాలను తుంగలో తొక్కుతూ ఏకపక్షంగా ఈ కమిషన్ ఇచ్చారు. 8బీ నోటీసులు ఇవ్వకుండా నివేదిక ఇచ్చారని ఆ రోజు సుప్రీం కోర్టు కొట్టేసింది. మాపై వేసిన ఈ కమిషన్ కూడా రాజకీయ ప్రేరేపితం, కుట్రే. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కూడా కోర్టులో నిలబడదు. ఇది డొల్ల రిపోర్టు. హక్కులకు భంగం కలిగినప్పుడు ఎవరైనా కోర్టుకు వెళ్తారు. నివేదికను రద్దు చేయాలనే కోర్టుకు వెళ్లాం. అసెంబ్లీలో చర్చించవద్దని కోరలేదు'' అని హరీశ్‌రావు అన్నారు.

## 'ఓటర్ అధికార్ యాత్ర'.. బిహార్‌లో కాంగ్రెస్‌కు బూస్ట్ ఇచ్చేనా?

ఈకబురు,హార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ను ఎన్నికల సంఘం చేపట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందులో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' ద్వారా మహిళా, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. మొత్తంగా 16 రోజులపాటు 25 జిల్లాల్లో 1300కి.మీటర్లకు పైగా సాగిన ఈ యాత్రతో కాంగ్రెస్ ఏమేరకు సఫలమైందనే విషయాన్ని పరిశీలిస్తే..

ఎస్‌ఐఆర్‌పై మొదలుపెట్టి..

ఓటరు జాబితా సమగ్ర సవరణను ఈసీ చేపట్టిన సమయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్.. లక్షలాది ఓట్ల తొలగింపు, డోర్‌టుడోర్ వెరిఫికేషన్‌లో లోపాలు, ఒకే ఇంటి నంబరుతో వందలాది మంది ఓటర్లు ఉన్న విషయాలను ప్రస్తావిస్తోంది. వీటిపై రాష్ట్రంలో పోరాటం చేస్తున్న వారిందర్నీ రాహుల్ యాత్ర ఏకం చేయడంతోపాటు ప్రజల్లో ఓటుపై అవగాహన పెరగడానికి తాజా యాత్రం దోహదపడినట్లు పార్టీ భావిస్తోంది.ఘనచరిత్ర ఉన్నా..

రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాటు (1990 వరకు) పాలించిన కాంగ్రెస్ అనంతరం మండల్ రాజకీయాల ప్రభావంతో తన ప్రాభవాన్ని కోల్పోయింది. లాలు ప్రసాద్ ఆ తరువాత నీతీశ్ పగ్గాలు చేపట్టిన తర్వాత దిగజారింది. 2005లో తొమ్మిది సీట్లకే (6.09శాతం ఓట్లు) పరిమితం కాగా.. 2010లో నాలుగు, 2015లో 27, 2020లో 19 సీట్లతో సరిపెట్టుకుంది. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి. ప్రస్తుతం 9.48శాతం ఓటర్ల మద్దతే ఉంది. సీట్ల సంఖ్య తగ్గడంతోపాటు క్యాడర్‌నూ క్రమంగా కోల్పోతున్నట్లు గ్రహించిన అధిష్ఠానం.. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించి అందుకు వ్యూహాలు రచిస్తోంది. బిహార్ ఎన్నికల్లో ఒక్క ఓటూ చోరీ కానివ్వం: రాహుల్

కూటమి ఐక్యత..రాష్ట్రంలో ఎన్డీయే అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాపై విమర్శలు గుప్పిస్తోన్న రాహుల్.. మహిళా సమస్యలతోపాటు రైతులు, పేదరికం, నిరుద్యోగం, పారిశ్రామికాభివృద్ధిలో వెనుకంజ వంటి అంశాలను లేవనెత్తే ప్రయత్నం చేశారు. దీంతోపాటు ఇండియా కూటమి ఐకమత్యంగా ఉందనే విషయాన్ని చాటిచెప్పే ప్రయత్నం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, వామపక్ష నేతలతోపాటు కాంగ్రెస్ సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య ఈ యాత్రలో పాల్గొన్నారు. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సహా ఇతర పార్టీల ప్రతినిధులు చివరిరోజు (సెప్టెంబర్ 1) యాత్రలో పాల్గొననుండగా.. మమతా బెనర్జీ తరఫున ప్రతినిధులను పంపించే అవకాశం ఉందని సమాచారం.అన్నివర్గాల పార్టీగా..

రాష్ట్రంలో యాదవ్, ముస్లింల మద్దతున్న పార్టీగా ఆర్జేడీ.. పేద, అణగారిన వర్గాల పార్టీలుగా వామపక్షాలకు పేరు ఉంది. సీపీఐ(ఎంఎల్) గత ఎన్నికల్లో 12 సీట్లను గెలుచుకుంది. ఆ పార్టీ కూడా ఇండియా కూటమిలో ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీనే అన్ని వర్గాల పార్టీగా ప్రకటించుకుంటోంది. ఈ క్రమంలో ఓటు చోరీ పేరుతో అధికార ఎన్డీయేపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలను అమలు చేస్తున్న రాహుల్.. బిహారీ స్టైల్‌లో టవల్‌ను మెడపై వేసుకోవడం, బైక్‌ను స్వయంగా నడుపుతూ, హైవే వెంట దాబాలను సందర్శిస్తూ స్థానికులతో మమేకమయ్యే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో మహిళలు, దళితులు, ముస్లింలు, యాదవ్‌లు, గిరిజన, ఓబీసీ, ఈబీసీ వర్గాల వారి సమస్యలను ప్రస్తావిస్తూ వారికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేశారు.భారత్ జోడో యాత్రతో సానుకూల ఫలితాలు వచ్చినట్లు భావిస్తున్న కాంగ్రెస్.. ఈ యాత్ర కూడా మరింత బూస్ట్ ఇస్తుందనే ఆశతో ముందస్తు ప్రచారానికి ఉపక్రమించింది. తాజాగా ఇది విజయవంతమైందని భావిస్తోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఎలాంటి వ్యూహాలు రచిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.



మొదటి పేజీ తరువాయి

## నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుత్ షాక్ తో కూలీ మృతి



**ఈ-కబురు,శేరిలింగంపల్లి : నిర్మాణంలో ఉన్న భవనంలో ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఓ కూలీ మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..**

ఉత్తర్రప్రదేశ్ కు చెందిన ఎండి.గౌస్(25) రెండు నెలల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. హఫీజ్ పేట్ లో నివాసం ఉంటూ కొండాపూర్ లోని మారుతినగర్ లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో గ్లాస్ అమర్చే పనులు చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అల్యూమీనియం ఫ్యాబ్రికేషన్ చేస్తుండగా ఇనుప పైపు భవనం పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్ కు గురై ఆపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనితో గౌస్ ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## డెలివరీ బాయ్ నిర్లక్ష్యం..



**బైక్ పై వెళ్తున్న యువకుడు మృతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : రాంగ్ రూట్లో ప్రయాణించే వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను సైతం ప్రమాదంలో పెడుతున్నారు. ఓ డెలివరీ బాయ్ రాంగ్ రూట్ లో వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా, ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... భీరంగూడ బీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఎన్.నరేష్(25) తన స్నేహితుడు మోషేతో కలిసి ఆదివారం రాత్రి 1 గంటలకు బుల్లెట్ బైక్ మీద కొండాపూర్ నుంచి మియపూర్ వైపు వెళ్తున్నాడు. కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి సమీపంలోని యూ టర్న్ వద్ద ఓ జెప్టో డెలివరి బాయ్ ఎలక్ట్రిక్ బైక్ తో రాంగ్ రూట్ లో వచ్చి నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొనగా బుల్లెట్ బైక్ మీద వెళుతున్న నరేష్ ఎగిరి కిందపడ్డాడు. దీంతో నరేష్ కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుల్లెట్ వెనుక కూర్చున్న మోషే కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. రాంగ్ రూట్ లో వచ్చిన జెప్టో డెలివరీ బాయ్ కి సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రంలో రెండ్రోజుల పాటు వర్షాలు

ఈకబురు,హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో నైరు తి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో పలు ప్రాంతాల్లో వచ్చే రెండ్రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేస్తూ ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**26 మండలాల్లో ఇంకా లోటు...**

జూన్, జూలై, ఆగస్టులలో 57.3 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 72.06 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. జిల్లాలవారీగా చూస్తే 8 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 10 జిల్లాల్లో అధికం, 15 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మెదక్ జిల్లాలో 90 శాతం అధిక వర్షాలు నమోద య్యాయి.136 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 238 మండలాల్లో అధికం, 221 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా 26 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది.

నిలకడగా గోదావరి కాళేశ్వరం: గోదావరినది నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 12.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహించింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాళేశ్వరానికి ఎగువ ఉన్న అన్నారం బరాజ్ నుంచి వద్ద 3.56 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోంది. మొత్తం 66 గేట్లు ఎత్తి ఉంచడంతో అక్కడి నుంచి కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నదితో కలిసి పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ బరాజ్‌కు 8.19 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తుండగా, 85 గేట్లు ఎత్తి నీటిని అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

## గణనాథుడి కృప ప్రజలపై సంపూర్ణంగా ఉండాలి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గచ్చిబౌలి కార్పొరేటర్**

ఈకబురు, శేరిలింగంపల్లి : గణనాథుడి కృపా కటాక్షాలు ప్రజలపై సంపూర్ణంగా ఉండాలని కోరుకున్నట్లు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపాలను ఆదివారం సందర్శించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి లంబోధరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ విఘ్నేశ్వరుని కరుణా, కటాక్షం ప్రజలపై తప్పక ఉంటుందన్నారు. గణనాథుడు ప్రతి మనిషి అజ్ఞానాన్ని తొలగించి మంచి జ్ఞానాన్ని ప్రసాదించాలని కోరారు. హిందూ బంధువులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఉత్సవం వినాయక చవితి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల హుడా రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ నాయక్, తిరుపతి, రంగస్వామి, రమేష్, సాయి, స్థానిక నేతలు,భక్తులు,మహిళలు, కాలనీ వాసులు, మండపాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



గణనాథుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



ఉత్సవ కమిటీ నిర్వాహకులతో కార్పొరేటర్

## మరాఠా కోటా.. ఏమిటీ 'హైదరాబాద్ గెజిట్'?



ఈకబురు, మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తోంది. మరాఠాలను కున్బీలుగా గుర్తించాలన్న ఆయన.. హైదరాబాద్, సతారా గెజిట్‌లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ కూడా వీటిని అమలు చేయడంలో న్యాయపరమైన చిక్కులపై అభిప్రాయాలను కోరుతున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరాఠా కోటా విషయంలో కీలకంగా మారిన ఈ హైదరాబాద్ గెజిట్ ఏంటనే విషయాన్ని పరిశీలిస్తే..హైదరాబాద్ గెజిట్ అనేది 1918లో నాటి నిజాం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు. అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంలో మరాఠా సామాజిక వర్గం ఎక్కువగా ఉండేదని.. అయినప్పటికీ ఉద్యోగాలు, పాలనలో వారిని నిర్లక్ష్యం చేశారనే వాదన ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నాటి నిజాం ప్రభుత్వం.. మరాఠా వర్గాన్ని 'హిందూ మరాఠాలు'గా గుర్తిస్తూ వారికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించింది. దీన్ని అధికారిక గెజిట్‌లోనూ పేర్కొంది. ఇదే హైదరాబాద్ గెజిట్‌గా ప్రాచుర్యం పొందింది.

**జరాంగేతో ప్రభుత్వ చర్చలు అసంపూర్ణం**

మరాఠా సామాజిక వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని అధికారిక రికార్డుల్లోనే పొందుపరిచారని వాదిస్తున్న మరాఠా కోటా ఉద్యమకారులు.. చారిత్రక వాస్తవాల ఆధారంగా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్ర జనాభాలో మరాఠాలు 28 శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం గతంలో పేర్కొంది. వీరిని ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) జాబితాలో చేర్చి, 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని జరాంగే డిమాండ్ చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం కున్బీలుగా గుర్తించే విషయంపై సుప్రీం కోర్టు గతంలో కీలక వ్యాఖ్యలు చేసిందని చెబుతోంది. మరాఠాలు, కున్బీలు ఒకే వర్గం కాదని సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన విషయాన్ని ధిక్కరించలేమని, ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాల్సి ఉన్నందున చర్చలు జరిపేందుకు సిద్ధంగానే ఉన్నామని వెల్లడించింది.

## సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు



ఈకబురు,టియాంజిన్ (చైనా), ఆగస్టు 31: భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలకు సహేతుకమైన, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం కనుగొనేందుకు కృషి చేయాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. ఇరుదేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై అంగీకారానికి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అస్థిరత నెలకొన్న సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన ప్రధాని మోదీ.. ఆదివారం జిన్‌పింగ్‌తో భేటీ అయి చర్చించారు. మోదీ, జిన్‌పింగ్ భేటీకి సంబంధించి విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ''ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను మరింత పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు తీసుకునేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాద నిర్మూలన, సహేతుక వాణిజ్యం అంశాలపై అంతర్జాతీయ వేదికలపై పరస్పర అవగాహనతో వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇరుదేశాల పాత్ర కీలకమని గుర్తించారు. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను విస్తరించడానికి రాజకీయ, వ్యూహాత్మక కోణంలో ముందుకు సాగాల్సిన అవసరంపై ప్రత్యేకంగా చర్చించారు. భారత్‌చైనా శత్రువులు కాదని.. అభివృద్ధి భాగస్వాములని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారవద్దని పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి వీలుగా.. నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, వీసా ప్రక్రియ సరళతరం చేయడం, పర్యాటక వీసాల జారీ, మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం వంటి చర్యలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. ఇరు దేశాల సరిహద్దుల్లో సైన్యాలను వెనక్కితీసుకోవడం, ఉద్రిక్తలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు'' అని విదేశాంగ శాఖ తెలిపింది.

శాంతి, స్థిరత్వం ముఖ్యం: మోదీ

భారత్‌చైనా సంబంధాలు బలోపేతం కావాలంటే.. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, గౌరవం ఆధారంగా ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని వివరించారు. భారత్, చైనా వ్యూహాత్మక స్వావలంబన పొందిన దేశాలని, ఈ రెండింటి మధ్య సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని భేటీలో స్పష్టం చేశారు. భారత్, చైనా మధ్య సహకారం 280 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించినదని.. ఇది ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుందని పేర్కొన్నారు.

ప్రత్యర్థులం కాదు..భాగస్వాములం: జిన్‌పింగ్

భారత్, చైనా స్నేహితులుగా ఉండటమే సరైన ఎంపిక అని.. సరిహద్దు సమస్యలు ఇరుదేశాల బంధాలను ప్రభావితం చేయవద్దని ప్రధాని మోదీతో జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగుపొరుగు దేశాలుగా, ఒకరి విజయానికి మరొకరు తోడ్పడే భాగస్వాములుగా ఉండాలని.. డ్రాగన్ (చైనా చిహ్నం), ఏనుగు (భారత చిహ్నం) కలసి నృత్యం చేయాలని వ్యాఖ్యానించారు. భారత్, చైనా ప్రత్యర్థులు కావని, సహకార భాగస్వాములని అభివర్ణించారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను పరోక్షంగా విమర్శిస్తూ.. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం, ఆసియాలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్, చైనా కలసి పనిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, శతాబ్దానికోసారి జరిగే మార్పులు వస్తున్నాయని చెప్పారు. కాగా, ఎస్‌ఈవోకు చైనా అధ్యక్షత వహించడం, టియాంజిన్‌లో సదస్సు నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ ఖితో కూడా ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

బ్రిక్స్ దేశాలపై ఆంక్షలను ఖండిస్తున్నాం: పుతిన్

భారత్, రష్యా, చైనా సహా పది దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమికి వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు టియాంజిన్‌కు వచ్చిన ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బ్రిక్స్ దేశాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసేలా విధిస్తున్న వివక్షాపూరిత ఆంక్షలను రష్యా, చైనా ఉమ్మడిగా ఖండిస్తున్నాయని చెప్పారు. అమెరికా ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లను పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలలో నిజమైన సమానత్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. కాగా, ఎస్‌ఈవో సదస్సుకు హాజరైన పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీకానున్నారు

## స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!



**ట్రంప్ సుంకాల వేళ మోదీ పిలుపు..**
**ఆత్మనిర్భరతతో అగ్రదేశంగా మారదాం!**
**బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. దేశీయ వస్తువులనే వాడండి**
**ప్రధానంగా పండుగల్లో ఇవే వినియోగించండి.. 'మన్ కీ బాత్'లో ప్రధాని**

ఈకబురు,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలు విధించిన వేళ.. దేశ ప్రజలంతా ఇక స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వచ్చేదంతా పండుగల కాలమని.. ఈ నేపథ్యంలో దేశీయంగా తయారుచేసిన వస్తువులనే ఉపయోగించాలని కోరారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదం, 'ఆత్మ నిర్భర్ భారత్' దేశాభివృద్ధికి తోడ్పడతాయని నొక్కిచెప్పారు. 'జీవితంలో అవసరమైన ప్రతి వస్తువూ స్వదేశీ తయారీవే అయిఉండాలి. ఇప్పటికే పలు ప్రాంతాలు గణేశ్ చతుర్థి వేడుకలు జరుపుకొంటున్నాయి. ఇంకొన్నాళ్లలో దసరా, దీపావళి వస్తున్నాయి. బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. ఇలా ఏవైనా భారతీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయండి. ఇవి స్వదేశీ వస్తువులని సగర్వంగా చెప్పండి' అని సూచించారు. కాగా, ఈ వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు విలయం సృష్టించాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.ఇవి దేశానికి పరీక్ష పెడుతున్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో విలవిలలాడిన జమ్మూకశ్మీరులోనే రెండు కీలక ఘట్టాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. పుల్వామాలో మొట్టమొదటి డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని.. శ్రీనగర్‌లోని ప్రసిద్ధ దాల్ సరస్సులో 'ఖేలో ఇండియా జల క్రీడల పండుగ' జరిగిందని గుర్తుచేశారు. విషాద ఘటనల కారణంగా వీటిని చాలా మంది గమనించలేదన్నారు. పుల్వామాలో క్రికెట్ జరగడం గతంలో అసాధ్యమని.. కానీ ఇప్పుడు దేశం పరివర్తన చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి ఆపరేషన్‌కు సంబంధించి సర్దార్ పటేల్ చేసిన వ్యాఖ్యల ఆడియోను మోదీ వినిపించారు. దేశానికి స్వాతం త్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్‌లో నిజాం, రజాకార్ల దురాగతాలు కొనసాగాయని తెలిపారు. సెప్టెంబరులో హైదరాబాద్ విమోచన దినం జరుపుకోనున్నామని.. 'ఆపరేషన్ పోలో'లో పాలుపంచుకున్న కథానాయకుల ధైర్యసాహసాలను గుర్తుచేసుకుందామని చెప్పారు.

## పార్టీలకు అతీతంగా మద్దతివ్వండి



ఈకబురు,ఎంతో నిబద్ధత, అంకితభావంతో ఈ పని చేస్తున్న సఫీనా హుస్సేన్ ఆసియాలో అత్యున్నత గౌరవానికి ఎంపికైంది'రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన మాల్దీవులకు చెందిన షాహినా అలీ, ఫిలిప్పీన్స్‌కు చెందిన ఫ్లావియానో ఆంటోనియో ఎల్ విల్లానుయేవా కూడా ఈ అవార్డును దక్కించుకున్నారు. నవంబర్ 7న మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో జరిగే అవార్డు ప్రదానోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈ అవార్డు ఎడ్యుకేట్ గాళ్స్‌కే కాదు.. మొత్తం దేశానికే చారిత్రాత్మకమైదని సంస్థ వ్యవస్థాపకురాలు సఫీనా హుస్సేన్ అన్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ గ్రాడ్యుయేట్ అయిన సఫీనా హుస్సేన్ 2007లో ఎడ్యుకేట్ గాళ్స్‌ను స్థాపించారు. అప్పటివరకూ శాన్‌ఫ్రాన్సిస్కోలో పనిచేసిన ఆమె.. మహిళల నిరక్షరాస్యతపై పనిచేయాలని భారత్‌కు తిరిగొచ్చారు. రాజస్థాన్‌లో తన సేవను ప్రారంభించారు. చదువుకోని లేదా బడి బయట ఉన్న బాలికలను తరగతి గదిలోకి తీసుకొచ్చారు. లక్షలాది మంది యువతులకు ఉన్నత విద్యతోపాటు, ఉపాధి కల్పించే విద్యనందించేందుకు కృషి చేస్తున్నారు.

ఆసియా నోబెల్‌గా పిలుచుకునే రామన్ మెగసెసే అవార్డు ప్రజలకు నిస్వార్థ సేవలందించిన, సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తులు, సంస్థలకు అందజేస్తారు. ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసే జ్ఞాపకార్థం 1957లో అవార్డును నెలకొల్పారు. రామన్ మెగసెసే పతకం, ప్రశంసా పత్రంతోపాటు నగదు బహుమతిని అందజేస్తారు. భారత్ నుంచి గతంలో రామన్ మెగసెసే అవార్డును గెలుచుకున్న వారిలో మదర్ థెరిసా (1962), జయప్రకాష్ నారాయణ్ (1965), చిత్రనిర్మాత సత్యజిత్ రే (1967), జర్నలిస్ట్ రవీష్ కుమార్ (2019), పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ (2018), అరవింద్ కేజ్రీవాల్ (2006), ఆర్టీఐ కార్యకర్త అరుణా రాయ్ (2000), కిరణ్ బేడి (1994) జర్నలిస్ట్ అరుణ్ శౌరి (1982) ఉన్నారు.

## కాళేశ్వరం నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

ఈకబురు,ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాలని, అందులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని తీసుకున్న నిర్ణయం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరిదేనని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చి చెప్పింది. 'ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీఇంజనీరింగ్‌ను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలన్న ఆలోచన ఆయనదే. ప్రాజెక్టు అంకురార్పణ దశ నుంచి ప్రతి నిర్ణయాన్ని ఆయనే స్వయంగా తీసుకున్నారు.డీపీఆర్‌ల తయారీ వ్యాప్కోస్‌కు అప్పగింత, తుది డీపీఆర్ అందకముందే అంచనాలను తయారు చేసి ఆమోదించడం, బరాజ్‌లలో నీరు నిల్వ చేయాలని ఆదేశించడం, కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించేలా నిబంధనలు మార్చాలని ఆదేశించడం వెనక ఆయన నిర్ణయాలే ఉన్నాయి. మూడు బరాజ్‌ల నిర్మాణానికి ప్రణాళికలు, నిర్మాణం, నిర్వహణలో నాటి సీఎం సూక్ష్మంగా భాగస్వాములయ్యారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్చాలనే నిర్ణయం ఆయనదే.రాజకీయ కార్యనిర్వాహకుడిగా వ్యవహరించాల్సిన నాటి సీఎం.. పాలనా అధికారిగా వ్యవహరించి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగించారు. చట్ట ప్రకారం ప్రభుత్వం ఆయనపై తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది'అని కమిషన్ సిఫారసు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఆదివారం శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నివేదిక 665 పేజీలతో 3 సంపుటిలుగా ఉంది. నాటి ఆర్థిక మంత్రి (ఈటల) తన బాధ్యతలను ఆదమరిచి నాటి సీఎం కోరికలు తీర్చుకునేందుకు సహకరించారని తప్పుబట్టింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

మంత్రివర్గ ఆమోదం లేకుండానే : మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి 2016, మార్చి 1న మూడు జీవోలు (నెం.231, 232, 233) జారీ చేశారు. ఆ తర్వాతి దశలోనూ మంత్రివర్గం నుంచి ర్యాటిఫికేషన్ పొందలేదు. నాటి సీఎం(కేసీఆర్), మాజీ నీటిపారుదల మంత్రి (హరీశ్) మాత్రమే ఆమో దించారు. ప్రభుత్వ బిజినెస్ రూల్స్‌లోని నిబంధనలను ఉల్లంఘిస్తూ పరిపాలనపర అనుమతుల జారీ చేశారు. టర్న్ కీ విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలని వ్యాప్కోస్ చేసిన సిఫారసులను కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కైఐపీసీఎల్) విస్మరించింది. ప్రాజెక్టు రూపకల్పన, మదింపు, ఆమోదించడం, నిధుల విడుదల, అమలు బాధ్యత, నిర్వహణ, పర్యవేక్షణ, మూల్యాంకనానికి కేఐపీసీఎల్‌ను ఏర్పాటు చేయగా, ఈ ప్రక్రియల్లో కేఐపీసీఎల్‌ను ప్రభుత్వం భాగస్వామ్యం చేయలేదు. కేవలం నిధుల సేకరణ, బ్యాంకులు, ఆర్థిక సంస్థ నుంచి రుణాల సమీకరణ, నిర్మాణ సంస్థలకు బిల్లుల చెల్లింపులకే కేఐపీసీఎల్‌ను సర్కారు పరిమితం చేసింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు అనేక మార్పులు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చారని నీటిపారు దల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి ఎస్‌కే జోషి చెప్పారు. నాటి సీఎం అధ్యక్షతన నిపుణులతో నిర్వహించిన చాలా సమావేశాల్లో కట్టడాల రకం, వాటి సామర్థ్యం, లొకేషన్, ప్లాన్ అలైన్‌మెంట్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి గూగు ల్ మ్యాప్‌లను విస్తృతంగా వినియోగించారు. '2015, ఫిబ్రవరి 4న మహారాష్ట్ర, ఏపీతో జరిగిన భేటీలో తమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తు తగ్గించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. 2016, ఆగస్టు 23న జరిగిన భేటీలో.. మేడిగడ్డ బరాజ్ ఎత్తు పెంపుపై వాస్తవ ముంపు మేరకు అంత్రరాష్ట్ర బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్ణయించారు.



# లింక్డిన్‌లో టిక్‌టాక్ ఉద్యోగావకాశాలు.. భారత్‌లోకి మళ్లీ అడుగుపెడుతుందా?

భారత్‌లో నిషేధం ఎదుర్కొంటున్న ప్రముఖ సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్ తాజాగా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. గురుగ్రామ్‌లోని తన ఆఫీస్‌లో రెండు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పోస్ట్ చేసింది. వీటిలో ఒకటి కంటెంట్ మోడరేటర్ (బెంగాలీ మాట్లాడగల అభ్యర్థి), మరొకటి మంచి భాగస్వామ్యం, కార్యకలాపాల నాయకత్వానికి సంబంధించిన పోస్టులు. ఈ నేపథ్యంలో టిక్‌టాక్ సేవలు భారత్‌లో మళ్లీ అందుబాటులోకి రాబోతున్నాయా? అనే ప్రచారం జోరందుకొంది.

భారత్‌లో ఇటీవల టిక్‌టాక్ వెబ్‌సైట్ అనేకమంది యాక్సెస్ చేయగలుగుతున్నారు. అయితే.. దానిలోకి లాగిన్ కావడం, వీడియోలను చూడటం సాధ్యం కావడంలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం టిక్‌టాక్‌పై ఇప్పటికీ నిషేధం కొనసాగుతోందని స్పష్టం చేసింది. భారత్‌లో టిక్‌టాక్ సేవలను పునరుద్ధరించేందుకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న కూడా ఇటువంటి వార్తలను ప్రభుత్వం ఖండించింది.

గతంలో టిక్‌టాక్ వెబ్‌సైట్ ల్యాండింగ్ పేజీలో భారత్‌లో దాని సేవలు అందుబాటులో లేవనే సందేశాన్ని చూపించేది. అయితే తాజాగా డెస్క్‌టాప్‌లో యాక్సెస్ చేస్తే 'అబౌట్ అజ్' పేజీ ఓపెన్ అవుతోంది. కానీ వీడియోలు మాత్రం కనిపించడం లేదు. యాప్ కూడా ఆండ్రాయిడ్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేయడానికి అందుబాటులో లేదు. భారత్‌లో టిక్‌టాక్ సేవలను మేము పునరుద్ధరించడం లేదని, భారత ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తున్నామని టిక్‌టాక్ ప్రతినిధి తెలిపారు.

బీజింగ్-న్యూఢిల్లీ సంబంధాల పునరుద్ధరణ వేగంగా జరుగుతున్న వేళ ఈ నియామకాల ప్రకటన రావడం గమనార్హం. మోదీ తింజియాంగ్ పర్యటన వేళ ప్రస్తుతం భారత్-చైనా మధ్య విమానాల రాకపోకలను కూడా పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో యాప్స్‌పై కూడా నిషేధం తొలగించవచ్చనే ప్రచారం యూజర్ల మధ్య జరుగుతోంది.

# ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ కొత్తగా వేస్తున్నారా?..

**మీరు వేతన జీవి అయినా, ఫ్రీలాన్సర్ లేదా ఇప్పుడే జాబ్ మార్కెట్లోకి ప్రవేశించినప్పటికీ, మొదటిసారి ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడం సంక్లిష్టంగా అనిపించవచ్చు. అందుకే ఆదాయపు పన్ను శాఖ తరచుగా ఐటీ రిటర్న్నులను సౌకర్యవంతంగా, వేగంగా దాఖలు చేయడానికి చిట్కాలు, పద్ధతులను తెలియజేస్తుంటుంది.**




ఐటీఆర్ దాఖలు చేయడానికి ముందు, పన్ను చెల్లింపుదారులు ఇన్‌కమ్ ట్యాక్స్ పోర్టల్లో నమోదు చేసుకోవడం చాలా అవసరం. ఫైలింగ్ ప్రక్రియను సజావుగా, సౌకర్యవంతంగా చేయడానికి, ఐటీఆర్ పోర్టల్లో ఎలా నమోదు చేసుకోవాలన్నదానిపై ఆదాయపు పన్ను శాఖ వివరణాత్మక గైడ్‌ను షేర్ చేసింది. ఈపోర్టల్లో నమోదు చేసుకోవడానికి దశలవారీ గైడ్‌ను వివరిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది.

**ఐటీఆర్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకోండిలా..**

**స్టెప్ 1:** ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్ www.incometax.gov.inకు వెళ్లండి. హోమ్ పేజీ ఎగువ కుడి వైపు మూలలో ఉన్న 'రిజిస్టర్' బటన్ పై క్లిక్ చేయండి.

**స్టెప్ 2:** యూజర్ టైప్ ట్యాబ్ లో 'ట్యాక్స్ పేయర్' ఎంచుకొని 'కంటిన్యూ' క్లిక్ చేయాలి.

**స్టెప్ 3:** 'పాన్' ఆప్షన్లో పర్మినెంట్ అకౌంట్ నెంబర్ ఎంటర్ చేసి 'వెలిడేట్' క్లిక్ చేయాలి. మీరు ఆధార్‌తో పాన్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి.

**స్టెప్ 4:** పాన్ వివరాలను ఇచ్చిన తర్వాత, మీ ఆధార్ లింక్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే వన్ టైమ్ పాస్వర్డును ఎంటర్ చేసి, 'కంటిన్యూ' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 5:** పూర్తి పేరు, పుట్టిన తేదీ, జెండర్, నివాస స్థితితో సహా ప్రాథమిక సమాచారాన్ని అందించండి. ఈ వివరాలను నమోదు చేసిన తర్వాత 'కంటిన్యూ' ఎంచుకోండి.

**స్టెప్ 6:** చెల్లుబాటులో ఉన్న కాంటాక్ట్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పూర్తి నివాస చిరునామా వంటి కాంటాక్ట్ వివరాలను నమోదు చేసి 'కంటిన్యూ' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 7:** మీరు ఇచ్చిన కాంటాక్ట్ నెంబరు, ఈమెయిల్ ఐడీపై రెండు వేర్వేరు ఆరు అంకెల ఓటీపీలను మీరు అందుకుంటారు. తర్వాత మీ కాంటాక్ట్ వివరాలను ధృవీకరించి సంబంధిత ఫీల్డ్ ల్లో ఓటీపీలను నమోదు చేయండి. ఒకవేళ మీకు ఓటీపీలు రాకపోతే 'రీసెండ్ ఓటీపీ'పై క్లిక్ చేయండి

**స్టెప్ 8:** ఇప్పటివరకు అందించిన సమాచారం అంతటిని సమీక్షించుకుని అన్నీ సరిగ్గా ఉన్నట్లయితే 'కన్ఫర్మ్' మీద క్లిక్ చేయండి.

**స్టెప్ 9:** బలమైన పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకుని మీ లాగిన్ క్రెడెన్షియల్స్ ను ధృవీకరించండి. తరువాత, ధృవీకరించడానికి అదే పాస్‌వర్డ్‌ను మళ్లీ నమోదు చేయండి. చివరగా, వ్యక్తిగతీకరించిన లాగిన్ సందేశాన్ని సెట్ చేయండి. మీరు ఫిషింగ్ వెబ్‌సైట్‌లో లేరని, అధికారిక ఐటీ వెబ్‌సైట్లో ఉన్నారని నిర్ధారించడానికి ఈ దశ సహాయపడుతుంది.

పాస్ వర్డ్ పాలసీ: కనీసం 8 క్యారెక్టర్లు, గరిష్టంగా 14 క్యారెక్టర్లు ఉండాలి. ఇందులో అప్పర్ కేస్, లోయర్ కేస్ అక్షరాలు రెండూ ఉండాలి. ఒక సంఖ్య, ఒక ప్రత్యేక అక్షరాన్ని కలిగి ఉండాలి (ఉదా. @#$%).

**స్టెప్ 10:** రిజిస్టర్ పై క్లిక్ చేయాలి. దీంతో మీ ఈఫైలింగ్ అకౌంట్ క్రియేట్ అయ్యి లాగిన్ పేజీకి వెళ్తారు.



# సెప్టెంబర్ 4న లాంచ్ అయ్యే టీవీఎస్ స్కూటర్ ఇదే

టీవీఎస్ మోటార్ కంపెనీ.. సెప్టెంబర్ 4న 'ఎన్‌టార్క్ 150'ను లాంచ్ చేయనుంది. దీనికి సంబంధించిన టీజర్ కూడా విడుదల చేసింది. ఇందులో రాబోయే స్కూటర్ హెడ్‌ల్యాంప్ క్లస్టర్ మాత్రమే కనిపిస్తోంది. ఇది క్వాడ్ ఎల్ఈడీ సెటప్‌తో.. టీషేప్ హౌసింగ్‌ను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది.

త్వరలో లాంచ్ కానున్న కొత్త టీవీఎస్ ఎన్‌టార్క్ 150 స్కూటర్.. బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్ వంటి లేటెస్ట్ ఫీచర్స్ పొందుతుందని తెలుస్తోంది. కాగా కంపెనీ ఈ స్కూటరుకు సంబంధించిన మెకానికల్ వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఇంజిన్ వివరాలు కూడా ప్రస్తుతానికి వెల్లడి కాలేదు.

ఇండియన్ మార్కెట్లో టీవీఎస్ ఎన్‌టార్క్ 150 స్కూటర్.. యమహా ఏరోక్స్ 155, హీరో జూమ్ 160 వంటి వాటికి ప్రత్యర్థిగా ఉండనుంది. దీని ధర రూ. 1.25 లక్షల నుంచి రూ. 1.35 లక్షల మధ్య ఉండే అవకాశం ఉందని సమాచారం.




# ఏఎఫ్‌డీతో ఎస్‌బీఐ ఒప్పందం: ఎందుకంటే?

పర్యావరణహిత ప్రాజెక్టులకు రుణాలందించే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), గుజరాత్ గిఫ్ట్ సిటీలోని 'ఏజెన్సీ ఫ్రాంకైస్ డి డెవలప్‌మెంట్'(ఏఎఫ్‌డీ)తో 100 మిలియన్ యూరోల లైన్ ఆఫ్ క్రెడిట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాలుష్యకారక ఉద్గారాలను, గ్లోబల్ వార్మింగ్‌ను, వాతావరణంపై ప్రతికూల ప్రభావాలను తగ్గించే దిశగా ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొంది. 2030 నాటికి మొత్తం రుణాల పోర్ట్‌ఫోలియోలో గ్రీన్ ఫైనాన్సింగ్ విభాగం వాటాను 7.5-10 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యానికి ఇది దోహదపడుతుందని ఎస్‌బీఐ తెలిపింది.

# గూగుల్ ఎమర్జెన్సీ అలర్ట్.. ఆ 2.5 బిలియన్ మంది జీమెయిల్ పాస్‌వర్డ్స్ మార్చాల్సిందే!









**గూగుల్ తన 2.5 బిలియన్ జీమెయిల్ యూజర్లకు కీలక హెచ్చరిక జారీ చేసింది. సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేందుకు వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలని సూచించింది. దీంతో పాటు టూ-స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ప్రారంభించుకోవాలని తెలిపింది. హ్యాకింగ్ ప్రయత్నాలు గణనీయంగా పెరగడంతో ఈ హెచ్చరిక చేసినట్లు గూగుల్ తెలిపింది. వీటి వెనక షైనీహంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్ల ముఠా ఉన్నట్లు గుర్తించామని వెల్లడించింది.**

2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈ గ్రూప్‌పై ఇప్పటికే ఏటీ&టీ, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి సంస్థల డేటా లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ హ్యాకర్లు ఫిషింగ్ పద్ధతిని ప్రధాన ఆయుధంగా వాడుతున్నట్లు గూగుల్ తెలిపింది. నకిలీ ఇమెయిళ్లు పంపి యూజర్లను వేరే లాగిన్ పేజీలలోకి మళ్లించడం, సెక్యూరిటీ కోడ్‌లు సహా కీలక సమాచారాన్ని దోచుకోవడం వీరి ప్రధాన వ్యూహం. గూగుల్ జూన్‌లోనే ఒక బ్లాగ్‌పోస్ట్‌లో "షైనీహంటర్స్ గ్రూప్ డేటా లీక్ సైట్ ప్రారంభించడానికి సిద్ధమవుతోందని భావిస్తున్నాం. దీంతో సున్నిత సమాచార దోపిడీ మరింత పెరిగే అవకాశముంది" అని హెచ్చరించింది. ఆ తరువాత ఆగస్టు 8న ప్రభావితమయ్యే అవకాశం ఉన్న యూజర్లకు ప్రత్యేకంగా మెయిల్స్ పంపి అకౌంట్ సెక్యూరిటీని తక్షణం పెంచుకోవాలని సూచించింది.

**టూ-స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరి**

దీని ద్వారా మీ ఇమెయిల్‌కు అదనపు సెక్యూరిటీ అందించొచ్చు. హ్యాకర్లు మీ పాస్‌వర్డ్‌ను తెలుసున్నప్పటికీ భద్రతా కోడ్ లేకుండా వారు లాగిన్ కాలేరు. ఈ కోడ్ సాధారణంగా మీ మొబైల్ లేదా నమ్మదగిన డివైజ్‌కు వస్తుంది. "2SV ప్రారంభిస్తే, దొంగలు మీ అకౌంట్‌లోకి చొరబడలేరు. మీ ఇమెయిల్‌ను సురక్షితంగా ఉంచుకోవడానికి ఇది అత్యవసరం" అని బ్రిటన్‌లోని యాక్షన్ ఫ్రాడ్ కూడా తెలిపింది. "2ఎస్‌వీ ఆన్ చేయడం కేవలం కొన్ని నిమిషాల పని. కానీ ఇది సైబర్ మోసాలను దరిచేరనీయదు" అని స్టాప్ థింక్ ఫ్రాడ్ వెబ్‌సైట్ పేర్కొంది.

ఇది జీమెయిల్‌కే పరిమితం కాదు. బ్యాంకింగ్, షాపింగ్, సోషల్ మీడియా అకౌంట్ల వంటి అన్ని ప్రధాన ఆన్‌లైన్ సర్వీసుల్లోనూ 2ఎస్‌వీ ఆప్షన్ అందుబాటులో ఉంది. సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో టూఫాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్‌ఏ) లేదా మల్టీఫాక్టర్ ఆథెంటికేషన్ (ఎంఎఫ్‌ఏ) పేరుతో అందుబాటులో ఉంటుంది.



# రానున్నది మహా సంక్షోభం!.. కియోసాకి హెచ్చరిక

**రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత 'రాబర్ట్ కియోసాకి' ఇప్పటి వరకు ధనవంతులు కావాలంటే ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే విషయం వెల్లడించారు. ఇప్పుడు దిగ్గజ దేశాల్లో తలెత్తే ఆర్థిక సంక్షోభం గురించి వెల్లడించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**

ఫ్రాన్స్ చారిత్రాత్మక బాస్టిల్ డే తిరుగుబాటును గుర్తు చేసే.. ఒక ముఖ్యమైన మలుపు దగ్గర పడుతోందని సూచించారు. ఈ అశాంతి నాటకీయ సామాజిక తిరుగుబాటుకు దారితీయవచ్చు. ఎందుకంటే ఫ్రాన్స్ ఒక భారీ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. బాండ్ల భద్రత గురించి కియోసాకి ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు బాండ్లపై అంత విశ్వాసం ఉంచాల్సిన అవసరం లేదు. ఇది భవిష్యత్తును ఇబ్బందుల్లో పడేస్తుందని అన్నారు. బాండ్స్ ఎప్పుడూ సేఫ్ కాదు అని అన్నారు.

2020 నుంచి అమెరికన్ ట్రెజరీ బాండ్లు 13% తగ్గాయి. యూరోపియన్ బాండ్లు 24%, బ్రిటిష్ బాండ్లు 32% తగ్గాయిని కియోసాకి పేర్కొన్నారు. జపాన్, చైనాలు అమెరికా బాండ్లను వదులుకుని బంగారం & వెండిని కొనుగోలు చేస్తున్నాయి. మిమ్మల్ని మీరు రక్షించుకోవాలంటే.. బంగారం, వెండి, బిట్‌కాయిన్‌లలోనే పెట్టుబడులు పెట్టుకోవాలని చెబుతూనే ఉన్నానని ఆయన అన్నారు. అమెరికాలో పెరుగుతున్న రుణ సవాళ్ల గురించి రాబర్ట్ కియోసాకి హెచ్చరించారు. ఇది చరిత్రలో అతిపెద్ద రుణగ్రహీత దేశంగా మారిందని హైలైట్ చేసింది. ఆర్థిక స్థిరత్వం ప్రస్తుతం ముప్పులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులను జాగ్రత్తగా మూల్యాంకనం చేయాలని పిలుపునిచ్చాయి.




# పదేళ్ల తర్వాత.. ఆ బాధ ఉండకూడదు: నాని

**సోషల్ మీడియాలో ఎదురయ్యే నెగెటివిటీపై నటుడు నాని స్పందించారు. మంచి విషయం గురించి చెప్పినా విమర్శలు తప్పట్లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమంలో మాట్లాడారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో ఇది. ఓటీటీ 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. తనకు నచ్చిన సినిమాకు జాతీయ అవార్డు దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గతంలో నాని పోస్టు పెట్టగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఆ విషయాన్ని జగపతి బాబు ప్రస్తావించగా నాని స్పందించారు.**

''ఒకప్పుడు మంచి, చెడు వేర్వేరు. తప్పు చేస్తే విమర్శిస్తారు, మంచి పని చేస్తే ప్రశంసిస్తారని బాల్యంలో నేర్చుకున్నాం. కానీ, ఇప్పుడు మంచైనా, చెడైనా ట్రోల్స్ వస్తున్నాయి. ఏదైనా విషయాన్ని నేరుగా చెప్పినా, ఎంత స్మార్ట్‌గా చెప్పినా విమర్శలు తప్పట్లేదు. మీరు పెట్టిన పోస్టుని అర్థం చేసుకున్న వారికన్నా అపార్థం చేసుకునే వారే ఎక్కువగా ఉంటున్నారు. 'నా ఉద్దేశం అది కాదు' అంటూ అందరికీ వివరణ ఇవ్వలేం కదా. అలాగని మనసులో మాట బయట పెట్టకుండా కూడా ఉండలేం. 'ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు.. ఒకవేళ సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఎవరేమనుకుంటారో' అని ఆలోచిస్తూ ఉండిపోవడం నరకమైపోతోంది. కామెంట్లను పట్టించుకోకపోవడమే మనం చేయగలిగింది. మనకు కరెక్ట్ అనిపించింది మనం చేయాలి. 'ఆరోజు నేను మాట్లాడి ఉండాల్సింది. మాట్లాడలేకపోయా' అనే బాధ పదేళ్ల తర్వాత ఉండకూడదు'' అని పేర్కొన్నారు.

ఒకే రోజు విడుదలయ్యే సినిమాల గురించి మాట్లాడుతూ.. ''మావాడి సినిమా ఆడాలి. వేరే వాడిది ఆడకూడదు' అని అభిమానులు, 'మన సినిమా హిట్ కావాలి. మరో సినిమా హిట్ కాకూడదు' అని ఇండస్ట్రీ వాళ్లు అంటుంటారు. నేను నా సినిమాలతోపాటు విడుదలయ్యే చిత్రాలూ విజయం అందుకోవాలని కోరుకుంటా. అందరూ బాగుంటేనే మనం బాగుంటాం'' అని పేర్కొన్నారు. 2023లో ప్రకటించిన జాతీయ అవార్డుల జాబితాలో 'జై భీమ్' సినిమా లేకపోవడంతో 'బ్రోకెన్ హార్ట్' ఎమోజీని పోస్టు చేశారు నాని. టాలీవుడ్‌కు వచ్చిన అవార్డుల గురించి ప్రస్తావించకుండా కోలీవుడ్ మూవీ గురించి పోస్టు పెట్టడంతో అప్పట్లో విమర్శలొచ్చాయి. 'జయమ్ము నిశ్చయమ్మురా'లో ఇప్పటికే నాగార్జున, శ్రీలీల సందడి చేశారు.



# సీఎం సిద్ధరామయ్యను కలిసిన రామ్‌చరణ్

**(కర్ణాటక):** ప్రముఖ తెలుగు సినీ నటుడు రామ్‌చరణ్ ఆదివారం మైసూరులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిశారు. చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' సినిమా చిత్రీకరణ కొన్ని రోజులుగా అక్కడే జరుగుతోంది. ఈ క్రమంలో సీఎం సిద్ధరామయ్య కూడా మైసూర్‌లోనే ఉండటంతో, ఆయన ఆహ్వానం మేరకు రామ్‌చరణ్ మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సత్కరించారు. అనంతరం సీఎం సిద్ధరామయ్య.. రామ్‌చరణ్‌కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పారు. ఇద్దరూ కాసేపు సినిమాలకు సంబంధించిన విషయాల గురించి మాట్లాడుకున్నారు. ప్రస్తుతం మైసూర్‌లో వెయ్యి మంది డాన్సర్ల నేపథ్యంలో 'పెద్ది' సినిమా పాట చిత్రీకరణ జరుగుతోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. జాన్వీ కపూర్ కథానాయిక. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' విడుదల కానుంది.





# కలాం బయోపిక్.. ధనుష్ కంటే గొప్ప యాక్టర్ ఇంకెవరున్నారు?

**తమిళ స్టార్ ధనుష్ .. ఎలాంటి పాత్రలోనైనా జీవించేయగలడు. తన నటనతో ప్రేక్షకులను కట్టిపడేయగలడు. అందుకే రెండుసార్లు (ఆడుకాలం, అసురన్ సినిమాలకుగానూ) ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం ఇతడు దివంగత శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం బయోపిక్ చేస్తున్నాడు. ఆదిపురుష్ ఫేం ఓం రౌత్ దీనికి దర్శకత్వం వహించనున్నాడు.**

**కలాం బయోపిక్**

ఈ సినిమాకు కలాం: ద మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అనే టైటిల్ ఖరారు చేశారు. మే నెలలో ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. తాజాగా ఓం రౌత్ మాట్లాడుతూ.. చిన్నప్పుడు నేను కలాంను ఇన్‌స్పిరేషన్‌గా తీసుకున్నాను. ఆయన పుస్తకాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. ఆయన గురించి వెండితెరపై చెప్పినప్పుడు మరెంతో మంది ఇన్‌స్పైర్ అవుతారు.

**ధనుష్ ఎందుకంటే?**

ధనుష్ అద్భుతమైన యాక్టర్. ఆయనకంటే గొప్ప నటుడు మరొకరు లేరు. కలాం బయోపిక్‌లో నటించేందుకు ధనుష్ ఒప్పుకోవడం సంతోషంగా ఉంది. ఆయనతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని ఓం రౌత్ చెప్పుకొచ్చాడు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించనున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థ అధినేత అభిషేక్ అగర్వాల్, టీ సిరీస్ సంస్థ అధినేత భూషణ్‌కుమార్ సంయుక్తంగా నిర్మించనున్నారు.

**సినిమా**

ధనుష్ విషయానికి వస్తే ఇటీవలే శేఖర్ కమ్ముల 'కుబేర'తో భారీ హిట్ కొట్టాడు. ప్రస్తుతం అతడి స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటించిన ఇడ్లీ కడై రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓం రౌత్ విషయానికి వస్తే.. బయోపిక్‌తోనే దర్శకుడిగా ప్రయాణం ప్రారంభించాడు. బాలగంగాధర్ తిలక్ బయోపిక్ 'లోకమాన్య: ఏక్ యుగపురుష్' మూవీతో దర్శకుడిగా మారాడు. తానాజీ, ఆదిపురుష్ సినిమాలు తెరకెక్కించాడు.

# మరో హారర్ చిత్రంలో రష్మిక?

ఇటీవలే 'కుబేర' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది నటి రష్మిక. ఈ దీపావళికి 'థామా'తో మరోసారి బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ఆమె.. ఆయుష్మాన్ ఖురానా జంటగా నటించిన ఈ హారర్ ప్రేమకథా చిత్రం అక్టోబరు 21న రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఇప్పుడు రష్మిక పేరు మరో హిట్ హారర్ ఫ్రాంఛైజీ చిత్ర విషయంలోనూ బలంగా వినిపిస్తోంది. 'కాంచన' సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన రాఘవ లారెన్స్.. ప్రస్తుతం 'కాంచన 4'ను సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇది తాను హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రం. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో పూజా హెగ్డే, నోరా ఫతేహి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. కాగా, ఇప్పుడిందులోని ఓ ప్రత్యేక పాత్ర కోసం చిత్ర బృందం రష్మికను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయినట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే దీనిపై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ అంచనాలు రెట్టింపు కానున్నాయి. ప్రస్తుతం రష్మిక నటించిన తెలుగు సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్' కూడా విడుదలకు సిద్ధంగానే ఉంది.





# సక్సెస్ అంటే డబ్బు, పేరు కాదు.. అలాంటి సినిమాలు చేయాలనుంది!

**రకుల్ ప్రీత్ సింగ్.. పేరు వినగానే, హీరోయిన్‌గానే కాకుండా ఫిట్‌నెస్ అండ్ హెల్త్ గుర్తొస్తుంది. ఆమె గురించి తెలుసుకోవాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలు ఉంటూనే ఉంటాయి. నటిగానే కాకుండా ఆమె ఫిట్‌నెస్, డ్యాన్స్, స్పోర్ట్స్, సోషల్ యాక్టివిటీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకుంది. రకుల్ గురించి ఇంకొన్ని విషయాలు...**

**నాన్న ఆర్మీ ఆఫీసర్**

రకుల్ ప్రీత్ సింగ్ న్యూఢిల్లీలోని సిక్కు కుటుంబంలో పుట్టింది. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆర్మీ ఆఫీసర్‌గా పని చేసేవారు. దాంతో ఆమె ఆర్మీ స్కూల్‌లోనే స్కూలింగ్ చేసి, ఆపైన జీసస్ అండ్ మేరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. రకుల్ ప్రీత్ జాతీయ స్థాయి గోల్ఫ్ ప్లేయర్. అంతేకాదు, ఎంతో ఆసక్తితో భరతనాట్యం కూడా నేర్చుకుంది. అలాగే ఆమెకు గుర్రపు స్వారీ చేయడం కూడా చాలా ఇష్టం.

**మోడలింగ్**

మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాక, రకుల్ 18 ఏళ్లకే కన్నడ సినిమా 'గిల్లి' ద్వారా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో నటించి.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. 'ఫెమినా' మిస్ ఇండియా-2011లో రకుల్ ఐదో స్థానంలో నిలిచింది. అందులోనే పాంటలూన్స్ మిస్ ఫ్రెష్ ఫేస్, ఫెమినా మిస్ టాలెంటెడ్, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ బ్యూటిఫుల్ ఐస్, పీపుల్స్ చాయిస్ మిస్ ఇండియా టైమ్స్ వంటి టైటిల్స్ గెలుచుకుంది.

**కోవిడ్ టైంలో..**

'మనకంటూ ప్రత్యేకంగా టైమ్ కేటాయించుకోవాలి. ఎవరి సంతోషం వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. దానికోసం ఎవరిపైనా ఆధారపడొద్దు' అన్నది రకుల్ అభిప్రాయం. రకుల్ తన సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరిచిపోలేదు. కోవిడ్ సమయంలో వంద కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా, క్రౌడ్ ఫండింగ్ చేసి పేదలకు డొనేషన్స్ అందించింది. 2017లో రకుల్ 'తెలంగాణ బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా అపాయింట్ అయింది.

**నాన్న నుంచే వచ్చాయి..**

2024లో తను ప్రేమించిన జాక్కీ భగ్నానీ ని గోవాలో వివాహం చేసుకుంది. మొదట ఓవర్సీస్‌లో పెళ్లి వేడుకలు జరపాలనుకున్నారట! కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలనే ఆలోచనతో గోవాలోనే ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. 'సక్సెస్ అంటే పేరు, డబ్బు కాదు. మనసుకు నచ్చిన పని చేస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపడం. చిన్నప్పటి నుంచి నాన్న నుంచి వచ్చిన డిసిప్లిన్, పంక్చువాలిటీ నన్ను ఎప్పటికీ హ్యాపీ లైఫ్ వైపే తీసుకెళ్తాయి.

**ఇష్టం**

దానివల్లే చేయాల్సిన పనిలో రెండు నిమిషాలు ఆలస్యమైనా నాకు ప్యానిక్ అటాక్ వచ్చేస్తుంది. సోషల్ ఎంటర్‌టైనర్స్ చేయడం నాకు చాలా ఇష్టం. వాటితో సమానంగా సోషల్ రెస్పాన్సిబుల్ సినిమాలూ చేయాలని ఉంది. ఫ్యాషన్, డ్రెస్సింగ్ విషయానికొస్తే, నాకు ఏది కంఫర్ట్ ఉంటే అదే ఎంచుకుంటాను' అని చెబుతుంది

**పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. 2047 నాటికైనా మనమంతా కాలుష్యరహిత దేశంలో ఉంటామని ఆశిస్తున్నాను. ప్రతి భారతీయ పౌరుడు బాధ్యతగా ఉంటేనే ప్లానెట్ ఎర్త్ బాగుంటుంది.**

**– రకుల్‌ప్రీత్ సింగ్**



# అందుకే పక్కకు రావాల్సి వచ్చింది

గత నెలలో రిలీజైన 'హరిహర వీరమల్లు' ఎంత పెద్ద డిజాస్టర్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిర్మాతకు భారీ నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ సినిమాకు మొదట క్రిష్ దర్శకుడిగా వ్యవహరించారు. మరి ఏమైందో ఏమో గానీ ఈయన తప్పుకోవడంతో నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ.. మిగిలిన పార్ట్ అంతా తీశారు. సరే ఫలితం ఏంటనేది పక్కనబెడితే ఇప్పుడు క్రిష్.. ఈ మూవీ గురించి స్పందించాడు.

'హరిహర వీరమల్లు' ప్రాజెక్ట్ నుంచి బయటకొచ్చేసిన తర్వాత నిర్మాతగా 'అరేబియా కడలి' అనే సిరీస్ తీసిన క్రిష్.. హీరోయిన్ అనుష్కని లీడ్ రోల్‌లో పెట్టి 'ఘాటీ' అనే యాక్షన్ మూవీ తీశారు. సెప్టెంబరు 5న ఇది థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన క్రిష్.. 'హరిహర..' వచ్చిన ప్రశ్నకు సమాధానమిచ్చాడు. రిలీజ్ టైంలో ట్వీట్ చేసిన ఈ దర్శకుడు.. ఇప్పుడు నేరుగా మాట్లాడాడు.

'హరిహర వీరమల్లు కొంత భాగం నేను చిత్రీకరించాను. నా వ్యక్తిగత కారణాల వల్ల పక్కకు రావాల్సి వచ్చింది' అని క్రిష్ చెప్పుకొచ్చాడు. బహుశా ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుండటమే క్రిష్.. సినిమా నుంచి బయటకు రావడానికి కారణం ఏమో అనిపిస్తుంది. అనుష్కతో చేసిన 'ఘాటీ'పై ఓ మాదిరి బజ్ అయితే ఉంది. 'ఘాటీ'లో అనుష్క లీడ్ రోల్ చేయగా.. తమిళ హీరో విక్రమ్ ప్రభు ఈమె సరసన నటించాడు. కొండల్లో స్మగ్మింగ్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో దీన్ని తెరకెక్కించారు. యువీ క్రియేషన్స్ నిర్మించింది. రెండేళ్ల క్రితం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీతో సక్సెస్ అందుకున్న స్వీటీ.. ఈసారి ఏం చేస్తుందో చూడాలి?

# జపాన్‌కు షాక్ ఇచ్చిన భారత్.. సూపర్ ఫోర్స్‌లో సత్తా చాటేందుకు సిద్ధం

**హాకీ ఆసియా కప్‌లో భారత్ మరోసారి అదరగొట్టింది. జపాన్‌తో జరిగిన రసవత్తర రెండో మ్యాచ్‌లో 3-2 తేడాతో గెలిచి వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో సూపర్ ఫోర్స్‌కు అర్హత సాధించి, టైటిల్ పోరులో నిలిచింది.**




హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు మరోసారి తన సత్తా చాటింది. జపాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 32 తేడాతో విజయం సాధించి, వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో సూపర్ ఫోర్స్‌లో స్థానం ఖాయం చేసుకుంది . ఈ క్రమంలో హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి రెండు గోల్స్‌తో జట్టును ఆదుకున్నాడు. రాజ్ కుమార్ పాల్ కూడా ఒక గోల్ సాధించాడు. ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగింది.

**మొదటి క్వార్టర్‌లో భారత్ దూకుడు**

మొదటి క్వార్టర్‌లో భారత జట్టు చాలా దూకుడుగా ఆడింది. చైనాతో జరిగిన మునుపటి మ్యాచ్‌లో అవకాశాల కోసం ఎదురు చూడాల్సి వచ్చినా, ఈసారి మొదటి నుంచే దాడి మొదలు పెట్టింది. జర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుతమైన పాస్‌తో సుఖ్‌జీత్‌కి బంతిని అందించాడు. 28 ఏళ్ల సుఖ్‌జీత్ లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి బంతిని మందీప్‌కి పంపాడు. మందీప్ ఆ బంతిని సమర్థవంతంగా ట్రాప్ చేసి, గోల్ సాధించాడు. ఇది భారత్‌కి మొదటి గోల్.

అప్పుడే హర్మన్ ప్రీత్ సింగ్ మైదానంలోకి దిగాడు. మ్యాచ్‌లో మూడో పెనాల్టీ కార్నర్‌ని అద్భుతమైన డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా మలిచాడు. ఐదో నిమిషంలో వచ్చిన ఈ గోల్ జపాన్‌ని కాస్త ఆశ్చర్యపరిచింది. జపాన్ కూడా వెనక్కి తగ్గలేదు, కొన్ని పెనాల్టీ కార్నర్స్ సంపాదించి దాడి చేసింది. కానీ, 150వ మ్యాచ్ ఆడుతున్న కృష్ణ పాఠక్ అద్భుతంగా గోల్‌ని కాపాడాడు.

**రెండు, మూడు క్వార్టర్లలో భారత్ ఆధిపత్యం**

రెండో, మూడో క్వార్టర్లలోనూ భారత్ తమ దూకుడుని కొనసాగించింది. సుఖ్‌జీత్ ఒక అవకాశంలో బంతిని గోల్‌కి కొట్టాడు. హర్మన్ ప్రీత్ కూడా 35వ నిమిషంలో ఒక అద్భుతమైన ఫీల్డ్ గోల్ అవకాశాన్ని కోల్పోయాడు. కానీ, జపాన్ కూడా వదల్లేదు. 36వ నిమిషంలో కవాబే ఒక గోల్ సాధించి, స్కోరుని 21కి తగ్గించాడు. హర్మన్‌ప్రీత్ మళ్లీ రంగంలోకి దిగి, మరో పెనాల్టీ కార్నర్‌ని గోల్‌గా మార్చి, మూడో క్వార్టర్ ముగిసే సమయానికి భారత్‌ని 31తో ఆధిక్యంలో నిలిపాడు.

**చివరి క్వార్టర్‌లో ఉత్కంఠ**

చివరి క్వార్టర్‌లో జపాన్ భారత్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఈ సమయంలో హర్మన్‌ప్రీత్ రెండు నిమిషాల సస్పెన్షన్ కారణంగా బెంచ్‌పై ఉండటంతో జపాన్‌కి కాస్త ఆశలు చిగురించాయి. కృష్ణ పాఠక్ స్థానంలో సురజ్ కర్కేరా గోల్‌కీపర్‌గా వచ్చాడు. అతను కొన్ని అద్భుతమైన సేవ్‌లు చేశాడు, కానీ కవాబే మరో పెనాల్టీ కార్నర్‌తో గోల్ సాధించి, స్కోరుని 32కి తీసుకొచ్చాడు. ఆ క్రమంలో జపాన్ చివరి నిమిషాల్లో మరిన్ని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదరలేదు. అలా, 32 స్కోరుతో భారత్ ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ని గెలిచి, సూపర్ ఫోర్స్‌లో స్థానం ఖాయం చేసుకుంది.



## 'ఇంకెన్ని రోజులు ఇలా..' రిషభ్ పంత్ ఇన్‌స్టా స్టోరీ వైరల్

ఇంగ్లాండ్‌తో అండర్సన్ తెందూల్కర్ ట్రోఫీ సమయంలో పాదానికి తీవ్ర గాయం కావడంతో రిషభ్ పంత్ విలవిలాడిపోయాడు. గాయంతోనే ఓ మ్యాచ్‌లో క్రీజ్‌లోకి వచ్చి హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. ఇప్పుడు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్న అతడు ఆసియా కప్‌లో ఆడటం లేదు. విండీస్‌తో టెస్టు సిరీస్‌కైనా వస్తాడో లేదో చెప్పలేని పరిస్థితి. అయితే, ఆస్ట్రేలియా పర్యటన నాటికి సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పెట్టిన ఫొటో వైరల్‌గా మారింది. దానికి అతడు ఇచ్చిన క్యాప్షన్ మైదానంలోకి దిగాలనే కోరికను బయటపెట్టింది. దాదాపు మూడేళ్ల కిందట (2022 డిసెంబర్) పంత్ రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. అక్కడ నుంచి కోలుకుని మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు. ఇప్పుడు బంతి బలంగా తాకడంతో ఆటకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి.

రిషభ్ పంత్ గాయం నుంచి కొద్దిగా కోలుకున్నాడు. సోషల్ మీడియాలో వీడియోలతో అభిమానులకు చేరువగానే ఉన్నాడు. అలాగే జిమ్‌లో వర్కౌట్లనూ ఆపడం లేదు. ఈ క్రమంలో కాలికి పట్టీ వేసుకొని ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ''ఇంకా ఇంకెన్ని రోజులు ఇలా'' అంటూ బాధపడుతున్నట్లు ఎమోజీలతో క్యాప్షన్ ఇచ్చాడు. దీంతో 27 ఏళ్ల పంత్ మైదానంలోకి దిగేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నాడు. అయితే, మెడికల్ స్కానింగ్‌లో పంత్ పాదం వద్ద ఎముకకు ఫ్రాక్చర్ అయినట్లు తేలడంతో కనీసం ఆరు వారాల విశ్రాంతి అవసరమని వైద్యబృందం సూచించింది. ఇప్పటికి దాదాపు నాలుగు వారాలు ముగిశాయి. అధికారికంగానే ఇంకా 15 రోజుల వరకూ విశ్రాంతి తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత గాయం పరిస్థితిని బీసీసీఐ వైద్యులు అంచనా వేస్తారు. ఓకే అనుకుంటే నెమ్మదిగా ప్రాక్టీస్ చేయించడం మొదలుపెడతారు. లేకపోతే మరికొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవడం రిషభ్ పంత్‌కు తప్పదు. అయితే, పూర్తిగా కోలుకుని వస్తేనే మళ్లీ అతడి వైవిధ్యమైన షాట్లను చూసే అవకాశం అభిమానులకు దక్కుతుంది.

## సిరాజ్‌కు అది 5స్టార్ జైలు.. ఓదార్చేందుకు కూడా కుదర్లేదు: భరత్

**హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ 2020లో టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియాలో జరిగిన ఆ టెస్ట్ సిరీస్ సమయంలో సిరాజ్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. దేశం తరఫున్ టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేస్తున్న సమయంలోనే అతడి తండ్రి మరణించారు.**




హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ 2020లో టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియాలో జరిగిన ఆ టెస్ట్ సిరీస్ సమయంలో సిరాజ్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. దేశం తరఫున్ టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేస్తున్న సమయంలోనే అతడి తండ్రి మరణించారు. అదే సమయంలో కరోనా ఆంక్షలను కూడా ఎదుర్కోవాల్సి రావడంతో సిరాజ్ తీవ్ర మానసిక క్షోభను ఎదుర్కొన్నాడు. అప్పటి కఠిన పరిస్థితుల గురించి బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ మాట్లాడాడు.

'అప్పటికే ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చేరుకుని ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో సిరాజ్ తండ్రి గురించిన సమాచారం తెలిసింది. కరోనా కావడంతో స్వదేశానికి రావడానికి కూడా సిరాజ్‌కు కుదరలేదు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ కఠిన నిబంధనల కారణంగా బయో బబుల్‌లోనే ఉండిపోవాల్సింది. సహచర క్రికెటర్లు కూడా సిరాజ్‌ను కలిసే వీలు లేదు. చివరకు అతి కష్టం మీద జట్టు మేనేజర్ సిరాజ్‌ను కలిసి మాట్లాడారు. అప్పుడు సిరాజ్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు' అని భరత్ అరుణ్ చెప్పాడు.

'సిరాజ్ రూమ్‌లో వేరెవరూ లేరు. ఒక్కడే కూర్చుని బాధపడేవాడు. నిజానికి అది సిరాజ్‌కు 5స్టార్ జైలు. ఆ సమయంలో మిగతా ఆటగాళ్లు కూడా సిరాజ్ దగ్గరకు వెళ్లలేకపోయారు. కేవలం వాట్సాప్ కాల్స్‌లో మాత్రమే మాట్లాడే వీలుండేది. కానీ, నేరుగా కలిసి మాట్లాడే దొరికే ఓదార్పు వేరు. మొత్తానికి ఆ సమయంలో సిరాజ్ చాలా కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాడు' అని భరత్ అరుణ్ పేర్కొన్నాడు.




## ఆసియాకప్‌లో బంగ్లాదేశ్ బోణీ..

**రాజ్‌గిర్ (బిహార్):** ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు భారీ విజయం సాధించింది. పూల్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో బంగ్లాదేశ్ 8-3 గోల్స్ తేడాతో చైనీస్ తైపీపై విజయం సాధించింది. బంగ్లాదేశ్ తరఫున మొహమ్మద్ అబ్దుల్లా (4వ, 26వ నిమిషాల్లో), రకీబుల్ హసన్ (42వ, 43వ నిమిషాల్లో), అష్రఫుల్ ఇస్లామ్ (45వ, 48వ నిమిషాల్లో) డబుల్ గోల్స్ సాధించగా... సోహనుర్ సోబుజ్ (36వ నిమిషంలో), రిజావుల్ బాబు (56వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు.

చైనీస్ తైపీ జట్టు తరఫున సుంగ్ యూ (10వ, 18వ నిమిషాల్లో) డబుల్ గోల్స్ చేయగా... సుంగ్ జెన్ షిహ్ (60వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. తొలి పోరులో మలేసియా చేతిలో ఓడిన బంగ్లాదేశ్... ఈ మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం కనబర్చింది.

మరో మ్యాచ్‌లో మలేసియా 4-1 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాపై గెలిచింది. మ్యాచ్ ఆరంభమైన రెండో నిమిషంలోనే గెనెహో జిన్ గోల్‌తో ఖాతా తెరిచిన ఐదుసార్లు చాంపియన్ దక్షిణ కొరియా... చివరి వరకు అదే జోరు కొనసాగించలేకపోయింది.

మలేసియా తరఫున అఖీముల్లా అన్వర్ (29వ, 34వ, 58వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టాడు. అష్రాన్ హమ్సాని (33వ నిమిషంలో) ఒక గోల్ కొట్టాడు. పూల్ 'ఎ'లో భాగంగా ఆదివారం జపాన్‌తో భారత్, కజకిస్తాన్‌తో చైనా తలపడనున్నాయి.

## ప్రపంచ క్రికెట్‌లో మరో స్టార్.. 'ఆ నలుగురికి' ఛాలెంజ్ విసురుతున్న లంక బ్యాటర్

**27 ఏళ్ల శ్రీలంక ఓపెనింగ్ బ్యాటర్ పథుమ్ నిస్సంక ప్రపంచ క్రికెట్‌లో మరో బ్యాటింగ్ స్టార్‌గా రూపాంతరం చెందుతున్నాడు. ఇతగాడు ఫార్మాట్లకతీతంగా చెలరేగుతూ, నయా ఫ్యాబ్ ఫోర్‌లో ఒకడిగా ఉండేందుకు పూర్తి స్థాయి అర్హుడినంటూ సవాళ్లు విసురుతున్నాడు.**




ఇప్పటివరకు 18 టెస్ట్‌లు, 71 వన్డేలు, 65 టీ20లు ఆడిన నిస్సంక.. టెస్ట్‌ల్లో 45 సగటున 4 సెంచరీలు, 7 అర్ధ సెంచరీల సాయంతో 1305 పరుగులు.. వన్డేల్లో 42 సగటున డబుల్ సెంచరీ, 7 సెంచరీలు, 17 అర్ధ సెంచరీల సాయంతో 2730 పరుగులు.. టీ20ల్లో 121.66 స్ట్రయిక్‌రేట్‌తో 14 అర్ధ సెంచరీల సాయంతో 1854 పరుగులు చేసి అతి తక్కువ మంది ఆల్ ఫార్మాట్ బ్యాటర్ల జాబితాలో ముందు వరుసలో నిలిచాడు.

నిస్సంక ప్రస్తుతం జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 76 పరుగులతో (92 బంతుల్లో 12 ఫోర్లు) రాణించిన అతను.. ఇవాళ (ఆగస్ట్ 31) జరుగుతున్న రెండో వన్డేలో అద్భుతమైన శతకంతో (136 బంతుల్లో 122; 16 ఫోర్లు) మెరిశాడు. ఈ మ్యాచ్‌లో జింబాబ్వే నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ తన జట్టును గెలుపు తీరాల వరకు చేర్చాడు.

నిస్సంక తాజా ప్రదర్శన తర్వాత ప్రపంచ క్రికెట్ అభిమానుల మధ్య నయా ఫ్యాబ్ ఫోర్‌పై చర్చ మళ్లీ మొదలైంది. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ, రూట్, విలియమ్సన్, స్మిత్ ఫ్యాబ్ ఫోర్‌గా కీర్తించబడుతున్నారు. వీరి కెరీర్‌లు చరమాంకానికి ఉన్న దశలో, నయా ఫ్యాబ్ ఫోర్ ఎవరనే చర్చ జరుగుతుంది. రేసులో చాలామంది యువ బ్యాటర్లు ఉన్నప్పటికీ.. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, హ్యారీ బ్రూక్, రచిన్ రవీంద్ర పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ నలుగురు ఫార్మాట్లకతీతంగా సత్తా చాటుతూ నయా ఫ్యాబ్ ఫోర్ రేసులో ముందున్నారు. వీరితో పాటు కెమరూన్ గ్రీన్, జేకబ్ బేతెల్ పేర్లు అడపాదడపా వినిపిస్తున్నా.. పోటీ మాత్రం గిల్, యశస్వి, బ్రూక్, రచిన్ మధ్యే ఉంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

ఇలాంటి తరుణంలో ఫ్యాబ్ ఫోర్‌లో ఉండేందుకు తాను కూడా అర్హుడినేంటూ పథుమ్ నిస్సంక ముందుకొచ్చాడు. తన అసమాన ప్రతిభతో నయా ఫ్యాబ్ ఫోర్‌లో బెర్త్‌కు ప్రధాన పోటీదారుగా మారాడు. ఫార్మాట్లకతీతంగా గణాంకాలు అతన్ని ప్రధాన పోటీదారుగా మారుస్తున్నాయి.

ఇదే ప్రదర్శనలను అతను ముమ్ముందు కూడా కొనసాగిస్తే, తప్పక నయా ఫ్యాబ్ ఫోర్‌లో ఒకడిగా కీర్తింబడతాడు. ప్రస్తుతానికైతే నిస్సంక నలుగురి మధ్య ఉన్న పోటీని ఐదుగురి మధ్యకు మార్చాడు.